

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

జనంసాక్షి

www.janamsakshi.org

మెదక్ - మహబూబ్‌నగర్

సంగారెడ్డి | సిద్దిపేట

జోగులాంబ గద్వాల

వనపర్తి | నారాయణపేట

నాగర్ కర్నూల్



శనివారం

07 నవంబర్ 2026

రూ. 14.26 కోట్ల ప్రభుత్వ ధాన్యం ఏమైంది?



కల్వకుర్తి రైస్‌మిల్లులో 4,876 మెట్రిక్ టన్నుల కొరత

- మీడియాకు సమాచారం ఎందుకు గోప్యం?
- ప్రజా ప్రయోజన ప్రశ్నలు..బియ్యం బ్లాక్ దందాకు అడ్డుకట్ట ఏది?
- వ్యాపారుల అధిక ధరల దోపిడీని అరికట్టేదెవరు?
- ప్రభుత్వ ధాన్యాన్ని దుర్వినియోగం చేస్తే కఠిన చర్యలు తప్పవు!
- కల్వకుర్తి ఎస్ఐ కురుమూర్తి హెచ్చరిక



కల్వకుర్తి, నవంబరు 7 (జనంసాక్షి): ప్రభుత్వధాన్యం నిల్వల్లో భారీ కొరత.. కోట్లాది రూపాయల ప్రజాధనం ప్రశ్నార్థకం.. అయినా ఈ వ్యవహారాలపై మీడియాకు ముందస్తు సమాచారం ఎందుకు అందడం లేదు?మిల్లుల్లో తనిఖీలు జరుగుతున్నా వివరాలు బయటకు రావడానికి ఎందుకు ఆలస్యమవుతోంది? మిల్లర్లకు అండదండలు ఎవరివి? అధికారుల పర్యవేక్షణలో ఇంతటి లోపాలు ఎందుకు చోటుచేసుకుంటున్నాయి? కల్వకుర్తి పట్టణ సమీపంలోని తర్నికల్ గ్రామంలో ఉన్న శ్రీ రాఘవేంద్ర ఆగ్రో ఇండస్ట్రీస్ రైస్‌మిల్లులో బయటపడిన భారీ ధాన్యం కొరత ఇప్పుడు అనేక ప్రశ్నలకు తావిస్తోంది. 4,876 మెట్రిక్ టన్నుల ధాన్యం కొరతఈ నెల 5న జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు,నిఘా విభాగం అధికారులు సంయుక్తంగా రైస్‌మిల్లులో తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రభుత్వానికి చెందిన 4,876 మెట్రిక్ టన్నుల ధాన్యం కొరత ఉన్నట్లు గుర్తించారు.దీని ప్రభుత్వ విలువ సుమారు రూ.14,26,65,307గా నిర్ధారించారు.అంటే రూ.14.26 కోట్లకు పైగా విలువైన ప్రభుత్వ ధాన్యం నిల్వల్లో లేకపోవడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

మిల్లర్లకు అండదండలు ఎవరివి?

ప్రభుత్వం అప్పగించిన ధాన్యాన్ని ఒప్పంద నిబంధనల ప్రకారం వినియోగించి,తిరిగి బియ్యం అప్పగించాల్సి ఉంటుంది.అయితే నిబంధనలకు విరుద్ధంగా ధాన్యాన్ని దుర్వినియోగం చేసి ప్రభుత్వానికి ఆర్థిక నష్టం కలిగించినట్లు జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్ దండు రాజేందర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇంత పెద్ద మొత్తంలో ధాన్యం కొరత ఏర్పడే వరకు సంబంధిత అధికారులు ఏంచేస్తున్నారనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.మిల్లులపై తనిఖీలు,నిల్వల లెక్కల పరిశీలన క్రమం తప్పకుండాజరుగుతున్నాయా? ఈ వ్యవహారంలో బాధ్యులెవరు? మిల్లర్లకు ఎవరైనా అండగా నిలుస్తున్నారా?అనే అంశాలపై సమగ్ర విచారణ జరగాల్సిన అవసరం ఉంది.

మిగతా 7లో..





టపాసుల షాపుల కోసం వసూళ్ల పర్వం

- మున్సిపల్,రెవెన్యూ,ఫైర్ శాఖలకు మామూళ్ళు
- నిబంధనలు బేఖాతరు
- ఆఫీసులు,స్కూల్ కాంప్లెక్స్ వద్ద అమ్మకాలు
- తూతూ మంత్రంగా అధికారుల తనిఖీలు

మిగతా 7లో..



నారాయణఖేడ్, (జనంసాక్షి):

పారిశ్రామిక కాలుష్యానికి మూగజీవి బలి!

- బొంతపల్లిలో రసాయన వ్యర్థ జలాలు తాగి గేదె మృతి
- వియాష్ సైంటిఫిక్ పరిశ్రమపై గ్రామస్తుల ఆరోపణలు..
- మృత గేదెతో ప్రధాన గేటు ఎదుట ఆందోళన



గుమ్మడిదల, నవంబర్ 7 (జనంసాక్షి): పారిశ్రామిక కాలుష్యం పశువుల ప్రాణాల మీదకు వస్తోందని బొంతపల్లి గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గుమ్మడిదల మండలంలోని బొంతపల్లి పారిశ్రామిక వాడలో ఉన్న వియాష్ సైంటిఫిక్ లిమిటెడ్ పరిశ్రమకు చెందిన రసాయన వ్యర్థ జలాలు తాగడం వల్ల తమ గేదె మృతి చెందిందని బాధితులు ఆరోపించారు.

మిగతా 7లో..

మెదక్ ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపిన పద్మ దేవేందర్ రెడ్డి



మెదక్, నవంబర్ 7 (జనంసాక్షి): చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే దీపావళి పండుగ ప్రజల జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని మాజీ ఉపసభాపతి,

మిగతా 7లో..



ఓటరు జాబితాలో పేరు లేకుంటే నవంబర్ 21లోగా దరఖాస్తు చేసుకోవాలి



• 38,564 మంది ఓటర్ల పేర్లు తొలగింపు.. అర్హులకు మరో అవకాశం



వనపర్తి, నవంబర్ 7 (జనంసాక్షి): ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణలో భాగంగా ముసాయిదా ఓటరు జాబితాలో పేర్లు లేని అర్హులకు ఎన్నికల సంఘం మరో అవకాశం కల్పించిందని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) టి.వినోద్ కుమార్ తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే లక్ష్యంగా అధికారులు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. శనివారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో సమావేశం నిర్వహించి ఓటరు జాబితా సవరణ, కొత్త ఓటర్ల నమోదు దరఖాస్తుల స్వీకరణపై సమీక్షించారు. ఈ సమావేశంలో వనపర్తి కలెక్టరేట్ నుంచి అదనపు కలెక్టర్ వినోద్ కుమార్ పాల్గొన్నారు.
గైర్హాజరు, చిరునామా మార్పు, మరణం తదితర కారణాలతో ముసాయిదా ఓటరు జాబితాలో పేర్లు లేని అర్హులు తిరిగి దరఖాస్తు చేసుకోవచ్చని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి తెలిపారు. ఈ నెల 21వ తేదీ వరకు ఓటరు నమోదు గణన పత్రాలను సమర్పించేందుకు అవకాశం ఉందన్నారు. ఇప్పటికే కొత్త ఓటరు నమోదుకు ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసుకున్నవారు మళ్లీ గణన పత్రాలు సమర్పించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఓటర్లు తమ పాత ఓటరు గుర్తింపు కార్డు సంఖ్య ఆధారంగా ఎన్నికల సంఘం అధికారిక వెబ్‌సైట్ లేదా ఈసీఐ నెట్ యాప్ ద్వారా కూడా గణన పత్రాలను సమర్పించవచ్చని తెలిపారు. గైర్హాజరు, చిరునామా మార్పు, మరణించిన ఓటర్ల వివరాలను పోలింగ్ కేంద్రాల వారీగా ప్రదర్శించాలని అధికారులను ఆదేశించారు.



ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ వినోద్ కుమార్ మాట్లాడుతూ.. వనపర్తి నియోజకవర్గంలో వివిధ కారణాలతో ముసాయిదా జాబితా నుంచి 38,564 మంది ఓటర్ల పేర్లు తొలగించినట్లు వెల్లడించారు. అర్హులైన ఓటర్లకు మరో అవకాశం కల్పించినందున బూత్ స్థాయి అధికారులు గణన పత్రాలు పంపిణీ చేస్తారని తెలిపారు. సంబంధిత ఓటర్లు నవంబర్ 21లోగా పత్రాలు పూర్తి చేసి సమర్పించాలని కోరారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి రామ్‌రెడ్డి, ఎన్నికల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్‌నినోపై విద్యార్థుల అవగాహన ర్యాలీ



మక్తల్, నవంబర్ 07 (జనంసాక్షి):
SVKR అకాడమీ అక్షయ రెడ్డి టెక్నో & ప్లే స్కూల్ విద్యార్థుల ఆధ్వర్యంలో మక్తల్ పట్టణంలోని పలు వీధుల మీదుగా తిరుగుతూ, ఎల్‌నినో ప్రభావాన్ని ప్రజలకు తెలుపుతూ ప్లకార్డులను ప్రదర్శించి అవగాహన కల్పించారు.
ఎల్‌నీనో వల్ల నష్టాలు, ఇబ్బందులను వాతవరణంలో జరిగే మార్పులు వాటి వల్ల ప్రజలకు, జీవకోటికి కలిగే ఇబ్బందులు రాబోయే రోజుల్లో నీటి కోసం తల్లడిల్లే పరిస్థితి రాబోతుందని ఇప్పటినుండే నీటిని వృథాగా చేయకుండా సేవ్ వాటర్ సేవ్ లైఫ్ అనే నినాదాలతో విద్యార్థుల చేత ప్రదర్శన నిర్వహించారు,ఈ కార్యక్రమంలో SVKR అకాడమీ చైర్మెన్ రమేష్ శెట్టి, ప్రధాన ఉపాధ్యాయురాలు శిరీష, పాఠశాల ఇంచార్జ్ రంజాన్ PET సందీప్, శ్రీకాంత్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారం అర్హులైన ప్రతిఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు



ఉర్కొండ, నవంబర్ 07 (జనంసాక్షి);
రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల మంజూరు ప్రక్రియలో భాగంగా ఉర్కొండ మండలం జకినాలపల్లి గ్రామ సర్పంచ్ కదిరే శేఖర్ యాదవ్ క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా అర్హులైన లబ్ధిదారులను గుర్తించి, ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన పరిస్థితులను పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్ల పథకం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామ అభివృద్ధికి కృషి చేస్తామని సర్పంచ్ కదిరే శేఖర్ యాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉర్కొండ మండల పశువైద్యాధికారి డా. రాజేష్, ఉప సర్పంచ్ పోలే రాజశేఖర్, పంచాయతీ కార్యదర్శి ముస్తఫా, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వెల్దండ మండల యాదవ సంఘం అధ్యక్షుడిగా తానేష్ యాదవ్



వెల్దండ, నవంబర్ 7 (జనంసాక్షి):
మండల యాదవ సంఘం అధ్యక్షుడిగా పోతేపల్లి గ్రామానికి చెందిన యువ నాయకుడు తానేష్ యాదవ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా యాదవ సంఘం అధ్యక్షుడు లాలు యాదవ్, తాలూకా అధ్యక్షుడు జక్కుల చిన్న జంగయ్య యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఉమా మనీలా సంజీవ యాదవ్ నియామక పత్రం అందజేసి శాలువాలతో సన్మానించారు. యాదవుల ఐక్యత, అభివృద్ధికి కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.
నూతన అధ్యక్షుడు తానేష్ యాదవ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యత అప్పగించిన పెద్దలకు కృతజ్ఞతలు తెలుపుతూ, యాదవుల సంక్షేమానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

పారిశుద్ధ్య కార్మికుల సేవలకు దీపావళి వేళ ఆత్మీయ గౌరవం




• కార్మికులకు స్వీట్ల పంపిణీ చేసిన బీఆర్ఎస్ నాయకుడు కుమార్ భేదడి



వనపర్తి, నవంబర్ 7 (జనంసాక్షి): పట్టణ పరిశుభ్రత, అభివృద్ధిలో పారిశుద్ధ్య కార్మికుల పాత్ర ఎంతో కీలకమని బీఆర్ఎస్ నాయకుడు కుమార్ భేదడి అన్నారు. మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి హయాంలో చేపట్టిన రహదారుల అభివృద్ధి పనులు వనపర్తి పట్టణ రూపురేఖలను మార్చాయని పేర్కొన్నారు.
పట్టణంలో అభివృద్ధి చేసిన రహదారులను ప్రతిరోజూ పరిశుభ్రంగా ఉంచుతూ వనపర్తిని క్లీన్ అండ్ గ్రీన్‌గా తీర్చిదిద్దడంలో మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ఎండ, వాన, పండుగలు అనే తేడా లేకుండా ప్రజల ఆరోగ్యం, పట్టణ పరిశుభ్రత కోసం నిరంతరం శ్రమించే కార్మికుల సేవలను ప్రతిఒక్కరూ గుర్తించి గౌరవించాలని పిలుపునిచ్చారు. దీపావళి పండుగను పురస్కరించుకుని వనపర్తి మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులను ఆత్మీయంగా కలుసుకుని స్వీట్ల బాక్సులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్మికులకు దీపావళి శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారి కుటుంబాల్లో సైతం సుఖసంతోషాలు, ఆనందాల వెలుగులు నిండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో చీర్ల శ్రీను, దేవర్ల నరసింహ, చీర్ల గోవర్ధన్, బాబు నాయక్ తదితర నాయకులు పాల్గొన్నారు.

తూప్రాన్ గీతా స్కూల్‌లో ఘనంగా దీపావళి సంబరాలు

తూప్రాన్, నవంబర్ 7(జనంసాక్షి):
తూప్రాన్ గీతా స్కూల్ లో ముందస్తు దీపావళి సంబరాలు అత్యంత ఘనంగా జరిగాయి. సాంప్రదాయ వస్త్రధారణలో విద్యార్థినిలు నృత్యాలతో అలరించారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన **నరకాసుర వధ నాటకం** ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సత్యభామ, శ్రీకృష్ణుడు, నరకాసురుని పాత్రల్లో చందన, ఇషిక, గౌతమ్ చక్కగా నటించి ఆకట్టుకున్నారు.





ఈ సందర్భంగా పాఠశాల చైర్ పర్సన్ ఉష మాట్లాడుతూ పాఠశాలల్లో దీపావళి జరుపుకోవడం అనేది విద్యార్థులలో సృజనాత్మకతను, సంస్కృతిపై అవగాహనను మరియు ఐక్యతను పెంపొందించుకోవడానికి ఎంతో ఉత్సాహంగా విద్యా పరమైన విలువలతో నిర్వహిస్తున్నామన్నారు.
చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే దీపావళి మనందరి జీవితాల్లో వెలుగులు నింపాలని ఆకాంక్షించారు.
ఈ సందర్భంగా పాఠశాల కరెస్పాండెంట్ పి. రామాంజనేయులు, డైరెక్టర్లు రాఘవేందర్ గౌడ్, నారాయణ గుప్తా, భరత్, డాక్టర్ మౌనిక, ప్రిన్సిపాల్ అరుణ, ఇంచార్జ్ ప్రిన్సిపాల్ ప్రేమ్ రాజ్ మరియు ఉపాధ్యాయులు విద్యార్థులకు దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు.

మృతుల కుటుంబాలకు తలసాని అనిల్ రెడ్డి ఆర్థిక సాయం



ఊర్కొండ, నవంబర్ 7 (జనంసాక్షి):
మండలంలోని ఊర్కొండకు చెందిన పోలే బక్కయ్య, రెవల్లి గ్రామానికి చెందిన వడ్డే రమేష్, రాంరెడ్డిపల్లికి చెందిన పోలే మైసయ్య అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న జకినాలపల్లి మాజీ సర్పంచ్ తలసాని అనిల్ రెడ్డి (టీఏఆర్) మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపి, ఒక్కో కుటుంబానికి రూ. 5 వేల చొప్పున మొత్తం రూ. 15 వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఫామ్ పాండ్ పనుల పరిశీలన...



చేర్యాల/మద్దూరు, నవంబర్ 07 (జనంసాక్షి):
మర్మాముల, బంజర గ్రామాల్లో జరుగుతున్న జలసిరి అభివృద్ధి పనుల్లో భాగంగా ఫామ్ పాండ్ పనులను గ్రామ సర్పంచ్ సుందరగిరి సత్యనారాయణ గౌడ్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండల తీవ్రత దృష్ట్యా ఉపాధి హామీ కూలీలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అశోక్, ఫీల్డ్ అసిస్టెంట్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

పోతిరెడ్డిపల్లిలో గ్రామసభ ఏర్పాటు చేయాలి

• పంచాయతీ కార్యదర్శికి వినతి



చేర్యాల, నవంబర్ 07 (జనంసాక్షి): సిద్దిపేట జిల్లా చేర్యాల మండల పరిధిలోని పోతిరెడ్డిపల్లి గ్రామంలో గ్రామసభ ఏర్పాటు చేయాలని కోరుతూ శనివారం దళితులు పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో దళితులు పాల్గొన్నారు.

12, 15వ వార్డుల్లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనుల పరిశీలన

నాణ్యతా ప్రమాణాలతో పనులు త్వరితగతిన పూర్తి చేయాలి: మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్



గుమ్మడిదల, నవంబర్ 7(జనంసాక్షి): గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని 12,15వ వార్డుల్లో చేపడుతున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల పురోగతిని సమీక్షించి, నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సంబంధిత కాంట్రాక్టర్లకు సూచించారు. నిర్ణీత గడువులోగా పనులు పూర్తిచేయాలని, ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకూడదని ఆదేశించారు.

అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ అందుబాటులోకి వస్తే వార్డుల్లో మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించడంతో పాటు పరిసరాల పరిశుభ్రత మెరుగుపడుతుందని ఆయన పేర్కొన్నారు. పనులు జరుగుతున్న సమయంలో స్థానిక ప్రజలకు రాకపోకల్లో ఇబ్బందులు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మున్సిపాలిటీ పరిధిలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ చిమ్ముల సంధ్య, వార్డు కౌన్సిలర్లు ఆకుల మాధవి, కత్తుల రమేష్, నాయకులు శ్రీనివాస్ రెడ్డి, హుస్సేన్, సంబంధిత అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మెదక్ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా ప్రవీణ్ కుమార్

- **ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ రావు చేతుల మీదుగా నియామక పత్రం అందజేత!**



మెదక్ నవంబర్ 7 (జనంసాక్షి): మెదక్ పట్టణ కాంగ్రెస్ పార్టీలో నూతన ఉత్సాహం వెల్లివిరిసింది. కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడంతో పాటు, ఎస్సీ వర్గాల హక్కుల పరిరక్షణ, సామాజిక న్యాయం, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా మెదక్ టౌన్ ఎస్సీ సెల్ అధ్యక్షులుగా చిన్నారోళ్ల ప్రవీణ్ కుమార్ నియమితులయ్యారు.

ఈ సందర్భంగా యంగ్ డైనమిక్ లీడర్, మెదక్ ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ రావు చేతుల మీదుగా ప్రవీణ్ కుమార్ నియామక పత్రాన్ని అందుకున్నారు.

ఈ కార్యక్రమంలో మందుగుల గంగాధర్ ఎస్సీ సెల్ రాష్ట్ర చైర్మన్ కావ్వంపల్లి సత్యనారాయణ, జిల్లా చైర్మన్ తాడేపు మహేందర్, మెదక్ జిల్లా నాయకులు నాగరాజ్, పోచయ్య, మెదక్ జిల్లా మైనార్టీ చైర్మన్ ఎం.డి. సూపి తదితర నాయకులు పాల్గొన్నారు. పార్టీ అప్పగించిన బాధ్యతను ఒక పదవిగా కాకుండా ప్రజలకు సేవ చేసే గొప్ప అవకాశంగా భావిస్తూ, ఎస్సీ వర్గాల సమస్యలపై నిరంతరం పోరాడుతూ, కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ, మెదక్ పట్టణంలో పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేస్తానని తెలిపారు. పదవులు ఆశించి కాదు.. బాధ్యతలు స్వీకరించి పనిచేసే నాయకత్వమే కాంగ్రెస్ పార్టీ బలం! యువ నాయకత్వానికి గుర్తింపు.. సామాజిక న్యాయానికి పెద్దపీట.. కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యం

చుంచనకోట
కాంగ్రెస్‌లో అధ్యక్ష పదవిపై అసంతృప్తి

చేర్యాల, నవంబర్ 07 (జనంసాక్షి):

చుంచనకోట గ్రామ కాంగ్రెస్ శాఖ అధ్యక్షుడి ఎంపిక వ్యవహారం పార్టీలో అసంతృప్తికి దారితీసింది. గ్రామ కార్యకర్తలతో సంప్రదించకుండా, పార్టీ శ్రేణులకు సమాచారం ఇవ్వకుండా మండల అధ్యక్షుడు మంజె మల్లేశం ఏకపక్షంగా నిర్ణయం తీసుకున్నారంటూ గ్రామ కాంగ్రెస్ కార్యకర్తలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయాన్ని తాము అంగీకరించడం లేదని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో కార్యకర్తలంతా కలిసి సిద్దిపేట జిల్లా డీసీసీ అధ్యక్షురాలు తుంకుంట అంక్షారెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. కార్యకర్తల అభిప్రాయాలకు ప్రాధాన్యమిస్తూ తమలో ఒకరైన బంగారు బాను ప్రసాద్‌ను గ్రామశాఖ అధ్యక్షుడిగా నియమించాలని కోరారు. డీసీసీ అధ్యక్షురాలు స్వయంగా చుంచనకోటకు వచ్చి కార్యకర్తలందరి సమక్షంలో సమావేశం నిర్వహించి గ్రామ కమిటీని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. పార్టీకోసం కష్టపడే కార్యకర్తల అభిప్రాయాలను గౌరవించాలని, ఏకపక్ష నిర్ణయాలకు తావివ్వకూడదని వారు స్పష్టం చేశారు.

చేర్యాలలో వృద్ధుడు ఆత్మహత్య...



చేర్యాల, నవంబర్ 07 (జనంసాక్షి): చేర్యాల పట్టణంలోని అంబేద్కర్ నగర్‌కు చెందిన ముస్త్యాల మల్లయ్య (83) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అనారోగ్య సమస్యలు, మానసిక ఒత్తిడి కారణంగానే ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత తీర్చాలి



పెద్దకొత్తపల్లి, నవంబర్ 7 (జనంసాక్షి): జొన్నల బొగుడ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల కొరతను తీర్చి అదనపు ఉపాధ్యాయులను నియమించాలని సర్పంచ్ ఆది ధర్మేందర్ కోరారు. శనివారం సర్వసభ్య సమావేశంలో అడిషనల్ డీఆర్డీఓ రాజేశ్వరి సమక్షంలో ఎంపీడీఓ రాములుకు వినతిపత్రం అందజేశారు. పాఠశాలలో ఏడు ఉపాధ్యాయ పోస్టులకు ఐదుగురు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారని, 117 మంది విద్యార్థులు చదువుతున్నారని తెలిపారు. ఖాళీగా ఉన్న రెండు పోస్టులను భర్తీ చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని కోరారు.

స్పందించిన అడిషనల్ డీఆర్డీఓ వెంటనే ఒక ఉపాధ్యాయుడిని నియమించేలా విద్యాశాఖ అధికారులతో మాట్లాడాలని ఎంఈఓ ఖాజా జియావుద్దీన్‌కు సూచించారు.

36వ రాష్ట్రస్థాయి
కబడ్డీ పోటీలకు సిద్దిపేట జిల్లా జట్టు సన్నద్ధం

కొండపాక, నవంబర్ 7(జనంసాక్షి):

కొండపాక మండలం దుద్దడలో కబడ్డీ క్లబ్ శిక్షణ శిబిరాన్ని స్థానిక సర్పంచ్ శివకుమార్తో కలిసి సందర్శించిన రాష్ట్ర ఎంపీటీసీల ఫోరం వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్ మాట్లాడుతూ.. 36వ సబ్ జూనియర్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొనేందుకు సిద్దిపేట జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులకు దుద్దెడ కబడ్డీ క్లబ్ ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నారు.

ఈ సందర్భంగా దేవి రవీందర్ ప్రత్యేకంగా సందర్శించిక్రీడాకారులను అభినందించారు. యువ క్రీడాకారులను దేశ భవిష్యత్తు మన పూర్వీకుల నుండి వస్తున్న గ్రామీణ ప్రాంత ఆట కబడి ఈ కబడ్డీ ఆట శారీర దారిడ్యం పాటు మానసిక ఉల్లాసానికి భవిష్యత్తులో మీ చదువుతోపాటు మీ క్రీడా ఆట మీ ఉద్యోగ అవకాశాలకు కొంత ఉపయోగపడుతుంది అని అన్నారు. కబడ్డీ స్వయంగా తన చిన్నప్పుడు వాడి నేటి వరకు యువతకు ఆదర్శంగా నిలుస్తూ కబడ్డీ ఆటను ప్రోత్సహిస్తు యువ తకు ఆదర్శంగా నిలుస్తున్న రాష్ట్ర కబడి అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ శివకుమార్ అండ్ టీంను అభినందించారు.

ఈ సందర్భంగా క్రీడాకారులకు అందిస్తున్న శిక్షణను పరిశీలించి, రాష్ట్రస్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

నవంబర్ 12 నుంచి 14వ తేదీ వరకు వికారాబాద్ జిల్లాలో నిర్వహించనున్న 36వ తెలంగాణ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాలుర కబడ్డీ ఛాంపియన్‌షిప్‌లో సిద్దిపేట జిల్లా జట్టు పాల్గొననుంది. కబడ్డీ అసోసియేషన్ సభ్యులు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో అధ్యక్షులు ప్రసాద్ కబడ్డీ అసోసియేషన్ కోశాధికారి సత్యం, జాయింట్ సెక్రటరీలు శ్రీకాంత్, చిన్న నర్సు, కరుణాకర్, దుద్దెడ కబడ్డీ క్లబ్ ప్రధాన కార్యదర్శి రోషిలి కిషన్, కోచ్ సంపత్, పల్లె కరుణాకర్, 1వ వార్డు సభ్యులు కందుగుల కరుణాకర్, సభ్యులు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

వెల్దండ గ్రామ ప్రజలకు దీపావళి పండుగ శుభాకాంక్షలు

- **గ్రామ సర్పంచ్ - మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్**



వెల్దండ, నవంబర్ 07 (జనంసాక్షి): వెల్దండ గ్రామ ప్రజలందరూ కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా, సురక్షితంగా దీపావళి పండుగను జరుపుకోవాలని సర్పంచ్ మట్ట యాదమ్మ మట్ట వెంకటయ్య గౌడ్ గ్రామ ప్రజల అందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. మీ జీవితాల్లో ఆనందం వెల్లివిరియాలని, వెలుగు పండుగ అందరికీ సుఖశాంతులను తీసుకురావాలని కోరుకుంటున్నాను. వాతావరణ కాలుష్యం, శబ్ద కాలుష్యం తక్కువగా ఉత్పత్తి చేసే టపాసులు మాత్రమే కాల్చి, నూనే దీపాలు వెలిగించి పండుగను సాంప్రదాయబద్ధంగా జరుపుకోవాలి అని సర్పంచ్ మట్ట యాదమ్మ మట్ట వెంకటయ్య గౌడ్ అన్నారు నిబంధనలను పాటించి, జాగ్రత్తలు తీసుకుంటూ దీపావళి పండుగను కుటుంబ సభ్యులతో కలిసి సురక్షితంగా జరుపుకోవాలని కోరారు.

అక్షర స్కూల్లో దీపావళి వేడుకలు...



తూప్రాన్, నవంబర్ 7(జనంసాక్షి): తూప్రాన్ అక్షర స్కూల్‌లో విద్యార్థుల ప్రదర్శన ఆకట్టుకుంది. దీపావళి పర్వదినం సందర్భంగా వెలుగులు పంచే "దీపం "ఆకారంలో కూర్చుని పండుగ ప్రాశస్త్యాన్ని తెలియజేశారు. ఈ దీపాల పండుగ మనందరి జీవితాల్లో వెలుగును, విజయాన్ని అందించాలని ప్రిన్సిపాల్ ఉదయశ్రీ విద్యార్థులకు దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు.

దుర్గ భవాని ఆలయానికి
జీఎంఆర్ ఫౌండేషన్ రూ.51 వేల విరాళం



సిర్గాపూర్, నవంబర్ 7 (జనంసాక్షి): మండలంలోని వాసర్ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ దుర్గభవాని మాత ఆలయ నిర్మాణానికి జీఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ నాయకుడు గుఱ్ఱపు మచ్చేందర్ ఆదేశాల మేరకు రూ.51 వేల విరాళాన్ని ఫౌండేషన్ సభ్యులు ఆలయ కమిటీకి అందజేశారు. ఆధ్యాత్మిక సేవకు సహకరించిన మచ్చేందర్‌కు గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ విజయ్, బీఆర్ఎస్ నాయకులు బసవరాజు పటేల్, యాదవరావు పాటిల్, ఇతర నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ వైజ్ఞానిక ప్రదర్శనలో సత్తాచాటిన విద్యార్థులు

- **జిల్లాస్థాయిలో ద్వితీయ బహుమతి.. రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు ఎంపిక**



తెలకపల్లి, నవంబర్ 7 (జనంసాక్షి): జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ వైజ్ఞానిక ప్రదర్శనలో మండల కేంద్రంలోని సిద్ధార్థ మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. విద్యార్థులు రూపొందించిన వినూత్న సైన్స్ ప్రాజెక్టుకు జిల్లా స్థాయిలో ద్వితీయ బహుమతి లభించడంతో పాటు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. నాగర్‌కర్నూల్‌లో శుక్రవారం నిర్వహించిన జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో పాఠశాలకు చెందిన రాజు, నవీన్ కుమార్ 'కెమో కూల్ ఫ్రిడ్జ్' అనే ప్రాజెక్టును ప్రదర్శించారు. వీరు రూపొందించిన నమూనా అందరినీ ఆకట్టుకోవడంతో న్యాయనిర్ణేతలు ద్వితీయ బహుమతికి ఎంపిక చేశారు. డీఈఓ రమేష్ చేతుల మీదుగా విద్యార్థులు అవార్డులు, ప్రశంసాపత్రాలు అందుకున్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను శనివారం పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయ బృందం అభినందించి ఘనంగా సన్మానించింది. విద్యార్థులు భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామ్, సతీష్ గౌడ్, ఆంజనేయులు, శ్రావణ్, భాగ్యశ్రీ, కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎండిన వరి పంటను పరిశీలించి రైతుకు రూ.5 వేల ఆర్థికసాయం



- రైతులకు అండగా నిలవని కాంగ్రెస్ ప్రభుత్వం: మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి
- కేసీఆర్ హయాంలో అడగకుండానే సంక్షేమ పథకాలు అందాయి

వనపర్తి బ్యూరో, నవంబర్ 7 (జనంసాక్షి): విద్యుత్ కోతలు, ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతుల కారణంగా పంటలు ఎండిపోయి నష్టపోతున్న రైతులను ఆదుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి విమర్శించారు.

గోపాల్‌పేట మండలం బుద్దారం గ్రామంలోని పాటిగడ్డ తండాకు చెందిన కాంగ్రెస్ పార్టీ వార్డు సభ్యుడు, రైతు రాములు నాయక్ సాగు చేసిన ఎండిన వరి పంటను శనివారం ఆయన పరిశీలించారు. రైతును పరామర్శించి ధైర్యం చెప్పారు. పంట నష్టంపై జిల్లా కలెక్టర్‌కు లేఖ రాసి ప్రభుత్వపరంగా నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేస్తానని హామీ ఇచ్చారు. అధైర్యపడవద్దని, అండగా ఉంటామని భరోసా కల్పిస్తూ తన వ్యక్తిగత సహాయంగా రూ.5 వేల ఆర్థిక సాయం అందించారు.

ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి కేసీఆర్ అడగకుండానే అనేక సంక్షేమ పథకాలను అమలు చేసి ప్రజలకు అండగా నిలిచారని పేర్కొన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులు విద్యుత్ కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నా పట్టించుకునే పరిస్థితి లేదని విమర్శించారు.

రైతు రాములు నాయక్ తనకు ఉన్న ఆరు ఎకరాల్లో వరి పంట సాగు చేయగా, మూడు సార్లు ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు గురికావడం, తీవ్ర విద్యుత్ కోతల కారణంగా మూడు ఎకరాల పంట పూర్తిగా ఎండిపోయిందని తెలిపారు. మార్పు పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను నిండా ముంచిందని, స్వయంగా కాంగ్రెస్ పార్టీకి చెందిన వార్డు సభ్యుడే తన పంట నష్టంపై ఆవేదన వ్యక్తం చేయడం బాధాకరమని అన్నారు. అలాగే శ్రీశైలం జలాల విషయంలో రాష్ట్ర రైతుల ప్రయోజనాలను పక్కనపెట్టి ఆంధ్రప్రదేశ్‌కు 110 టీఎంసీల నీటిని తరలించేందుకు ప్రభుత్వం సహక రిస్తోందని రేవంత్ రెడ్డిపై నిరంజన్ రెడ్డి ఘాటుగా విమర్శలు చేశారు.

ఈ సందర్భంగా రైతు రాములు నాయక్ మాట్లాడుతూ.. తన పంట ఎండిపోయి తీవ్రంగా నష్టపోయినప్పటికీ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎవరూ వచ్చి పరామర్శించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు ధైర్యం చెప్పి, వ్యక్తిగతంగా రూ.5 వేల ఆర్థిక సాయం అందించిన మాజీ మంత్రి నిరంజన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిరంజన్ రెడ్డి వెంట తిరుపతయ్య, జంప్లా నాయక్,ప్రజాప్రతినిధులు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

సిర్గాపూర్ ఎస్సై మహేష్ గమనిక...

- దీపావళిని ప్రశాంతంగా జరుపుకోండి
- పేకాట, అసాంఘిక కార్యకలాపాలపై హెచ్చరిక
- దీపావళి కానుకల పేరుతో వచ్చే ఫోన్ కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలి



సిర్గాపూర్, నవంబర్ 7 (జనంసాక్షి): సిర్గాపూర్ మండల ప్రజలు ఈ దీపావళిని ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలని సిర్గాపూర్ ఎస్సై మహేష్ కోరారు. ఎవరూ కూడా పేకాట కానీ, ఇతర అసాంఘిక కార్యకలాపాల్లో పాలుపంచుకోకూడదని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.అలాగే దీపావళి కానుకలు అంటూ తెలియని వ్యక్తులు ఫోన్లు చేసినా, లింకులు పంపినా ఎవరూ కూడా వాటికి స్పందించకూడదని, అప్రమత్తంగా ఉండాలని తెలియజేశారు. అనుమానాస్పద కాల్స్ వస్తే వెంటనే పోలీస్ స్టేషన్ కు సమాచారం ఇవ్వాలని కోరారు.అందరికీ దీపావళి శుభాకాంక్షలు,

దీటి రాజుకు వినోద్ కుమార్ ఘన సన్మానం



బెజ్జంకి, నవంబర్ 7 (జనంసాక్షి): తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి సిద్దిపేట జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దీటి రాజును రాష్ట్ర ప్రణాళిక సంఘం మాజీ ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్ శాలువాతో ఘనంగా సన్మానించారు. రజక సంఘం బలోపేతానికి, సామాజిక సేవా కార్యక్రమాలకు ఆయన చేస్తున్న కృషిని అభినందించారు. రజక సమాజ ఐక్యత, అభివృద్ధి, హక్కుల సాధనకు మరింత కృషి చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జి.వి. రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

పాకాల చెల్మారెడ్డికి ప్రముఖుల నివాళులు



బెజ్జంకి, నవంబర్ 7 (జనంసాక్షి): లక్ష్మీపూర్ గ్రామంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాకాల మహిపాల్ రెడ్డి తండ్రి చెల్మారెడ్డి ప్రథమ వర్ధంతి నిర్వహించారు. కార్యక్రమానికి మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జి.వి. రామకృష్ణారావు హాజరై చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిద్ధం వేణు, కేతిరెడ్డి దేవేందర్ రెడ్డి, రావుల రమేష్, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

పెద్ద శంకరంపేట మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలి

- సంగారెడ్డి జిల్లా బిజెపి ఓబీసీ అధ్యక్షుడు కోణం విఠల్...



పెద్ద శంకరంపేట, నవంబర్ 6 (జనంసాక్షి): పెద్ద శంకరంపేట మండలాన్ని ప్రభుత్వం వెంటనే కరువు మండలంగా ప్రకటించాలని సంగారెడ్డి జిల్లా బిజెపి ఓబీసీ అధ్యక్షుడు కోణం విఠల్ అన్నారు.. శనివారం పెద్ద శంకరంపేట లోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మండల స్థాయి కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు.. ప్రభుత్వం వెంటనే పెద్ద శంకరంపేట మండలాన్ని కరువు మండలంగా ప్రకటించడంతో పాటు రైతులను అన్ని విధాలుగా ఆదుకోవాలని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే రైతులకు రైతు బంధు డబ్బులను రైతుల అకౌంట్లో జమ చేయాలన్నారు. బ్యాంకులలో రైతులకు సంబంధించిన రుణాలను రీ షెడ్యూల్ చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పేట మండల బిజెపి అధ్యక్షుడు శ్రావణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి ఎం కృష్ణ. బీజేవైఎం అధ్యక్షుడు బుగుడాల కృష్ణ, బిజెపి నాయకులు చందుపట్ల అనిల్, సుభాష్ నాయక్, ఆరే అనిల్, భూషణం సుకుమార్ ధ్రువ నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు జూనియర్ కళాశాలలో డ్రగ్స్ వ్యతిరేక అవగాహన

- విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించిన ఎస్సై జయన్న



ఆత్మకూర్, నవంబర్ 07 (జనంసాక్షి): వనపర్తి జిల్లా ఆత్మకూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం డ్రగ్స్ వ్యతిరేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆత్మకూరు ఎస్సై జయన్న మాట్లాడుతూ విద్యార్థులకు డ్రగ్స్ వల్ల కలిగే నష్టాల గురించి వివరించారు. చీఁఱూ చట్టం గురించి, డ్రగ్స్ వల్ల కలిగే ఆరోగ్య, కుటుంబ, చట్టపరమైన పరిణామాల గురించి అవగాహన కల్పించారు.డ్రగ్స్ మొదట సరదా – తర్వాత జీవితాంతం బాధ అని, డ్రగ్స్ వల్ల చదువు, ఆరోగ్యం, కుటుంబం, భవిష్యత్తు అన్నీ నాశనమవుతాయని హెచ్చరించారు. ఎవరైనా డ్రగ్స్ ఇస్తానంటే వెంటనే పెద్దలకు, పోలీసులకు చెప్పాలని సూచించారు.అనంతరం విద్యార్థులందరితో చేతులు చాపి డ్రగ్స్ కు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు.డ్రగ్స్ సమాచారం కోసం టోల్ ఫ్రీ – 1933, డ్రగ్స్ మానేయడానికి సహాయం కోసం – 14446 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

బల్కంచెల్క తాండ

అంగరంగ వైభవంగా 38వ మాస చండీ హోమం



నిజాంపేట్, నవంబర్ 07 (జనంసాక్షి): నిజాంపేట్ మండలంలోని బల్కం చెల్కతాండ గ్రామపంచాయతీ పరిధిలోని శ్రీ విశ్వపాలిని జ్వాలాముఖి శ్రీ సేవాలాల్ మహారాజ్ మహా మందిరంలో 38వ మాస చండీ హోమం అంగరంగ వైభవంగా నిర్వహించారు.ఈ సందర్భం గా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి, వేద మంత్రాల మధ్య చండీ హోమం, అభిషేకాలు, పూజలు నిర్వహించారు.

భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. జ్వాలాముఖి అమ్మవారు కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి అని, భక్తితో కొలిచిన వారికి సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం ప్రసాదిస్తుందని తెలిపారు. అమ్మవారి అనుగ్రహంతో గ్రామంలో సుభిక్షం, శాంతి, సౌభాగ్యం కలుగుతుందని, ప్రతి నెలా నిర్వహిస్తున్న ఈ చండీ హోమంలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు మనోజ్ శర్మ, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



గ్రామీణస్థాయిలో యంత్రాంగం ఫోకస్

- మెదక్ అదనపు కలెక్టర్ నగేష్

పాపన్నపేట, నవంబర్ 7 (జనంసాక్షి): మెదక్ జిల్లాలో 40 గ్రామపంచాయతీలతో ఉన్నా సువిశాల మండల మైనా పాపన్నపేటలో సాగుతన్న ప్రభుత్వ పాలన తీరు పై జిల్లా యంత్రాంగం దృష్టి సారించింది. ఇటీవలే ఎంపీడీఓ విష్ణువర్ధన్ పై సస్పెన్షన్ వేటు పడి పడింది. శుక్రవారం మెదక్ ఆర్డీవో రమాదేవి,శనివారం మెదక్ అదనపు కలెక్టర్ మెంచు నగేష్ ముద్దాపూర్ గ్రామంలో భూసర్వే డిజిటల్ పనులను పరిశీలించి సిబ్బందికీ తగు సూచనలు చేశారు. అనంతరం కుర్తివాడలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనుల పురోగతి పై ఆయన ఆరా తీశారు. అధికారుల విధుల్లో సిబ్బంది సమన్వయం కోరవడితే ప్రజా పాలన నత్త నడకన సాగే అవకాశం సుస్పష్టం అని సమాచారం.! తహసీల్దార్ సతీష్ కుమార్,ముద్దాపూర్,కుర్తివాడ సర్పంచులు నాగరాజు,శ్రీధర్ తదితరులు ఉన్నారు.

ఆకునూరులో విద్యార్థులకు యూనిఫామ్‌ల పంపిణీ



చేర్యాల, నవంబర్ 7 (జనంసాక్షి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలనే సీఎం రేవంత్ రెడ్డి లక్ష్యానికి అనుగుణంగా ఆకునూరు గ్రామంలో విద్యార్థులకు యూనిఫామ్‌లు, టైలు, బెల్టులు, షూలను పంపిణీ చేశారు. సర్పంచ్ కొమ్ము రవి ఆధ్వర్యంలో శనివారం ఎంపీపీఎస్‌లో ప్రధానోపాధ్యాయుడు అయోధ్య, ఉపాధ్యాయులు విద్యార్థులకు వాటిని అందజేశారు. పేద విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, సమానత్వ భావన పెంపొందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు అందె నానిబాబు, ఉపసర్పంచ్ పల్లవి భాస్కర్, కాంగ్రెస్ నాయకులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఖో-ఖో పోటీలకు కృష్ణాపూర్ విద్యార్థినులు ఎంపిక



కల్హేర్, నవంబర్ 7 (జనంసాక్షి): మండలంలోని కృష్ణాపూర్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు ఉమ్మడి జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ఐ ఖో-ఖో పోటీల్లో ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించిన పోటీల్లో సంగారెడ్డి జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించిన సీహెచ్. హరిత అండర్-17 విభాగంలో, డి. శివాత్మిక అండర్-14 విభాగంలో ఎంపికయ్యారు. హరిత మేధ్చల్ జిల్లా మల్కాజిగిరిలో, శివాత్మిక వికారాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారు.

విద్యార్థినుల విజయంపై పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. వారికి శిక్షణ ఇచ్చిన పీఈటీ రాములును సన్మానించారు. గ్రామీణ విద్యార్థుల్లో ప్రతిభకు కొదవ లేదని, సరైన శిక్షణతో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని రాములు పేర్కొన్నారు.విద్యార్థినులు రాష్ట్రస్థాయిలో రాణించి జాతీయస్థాయికి ఎంపిక కావాలని ఉపాధ్యాయులు, గ్రామస్థులు ఆకాంక్షించారు.



సిర్గాపూర్ గిరిజన గురుకులాన్ని ఆర్సీఓ ఆకస్మిక తనిఖీ

- విద్యాబోధన, వసతులు, భోజన నాణ్యత పరిశీలన
- బాలికల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశం

సిర్గాపూర్, నవంబర్ 7 (జనంసాక్షి): సిర్గాపూర్ మండల కేంద్రం లోని గిరిజన బాలికల గురుకుల పాఠశాల, కళాశాలను ఆర్సీఓ నాగార్జున రావు శనివారం ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. విద్యార్థులకు అందుతున్న విద్యాబోధన, వసతులు, భోజన నాణ్యతను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. బాలికల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో గురుకుల ప్రిన్సిపల్ రజిని రాఘులత, వైస్ ప్రిన్సిపల్ ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

సింగిల్ విండో నూతన చైర్మన్ భూపతి రెడ్డికి ఘనంగా సన్మానం



వెల్దండ, నవంబర్ 07 (జనంసాక్షి): వెల్దండ మండలం సింగిల్ విండో నూతన చైర్మన్గా ఎన్నికైన ఎన్నం భూపతిరెడ్డిని శనివారం ఆయన నివాసంలో ఉప సర్పంచ్ శ్రీను ముదిరాజ్ ఆధ్వర్యంలో శాలువాతో ఘనంగా సన్మానించి సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తన యొక్క సుదీర్ఘమైన అనుభవంతో సింగల్ విండోని అభివృద్ధి చేసి, రైతులందరికీ సకాలంలో మందులు ఎరువులు విత్తనాలు అందించి రైతుల అభివృద్ధికి కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కాసారపు వెంకటయ్య, కృష్ణ ముదిరాజ్, టౌన్ ప్రెసిడెంట్ బాదేపల్లి మల్లయ్య, పంచాయతీ కార్యదర్శి గిరి గౌడ్, కృపానందం, మట్ట నిరంజన్, మల్లయ్య,వార్డు సభ్యులు ముదిగొండ రమేష్, మసిగుండ్ల వెంకటేష్,మారేపల్లి శ్రీను, కాసారపు మల్లేష్ పాల్గొన్నారు.

ఎత్తిపోతల పథకం భూనిర్వాసితులకు హాకింపేట ప్యాకేజీ వర్తింపజేయాలి



నారాయణపేట జిల్లా బ్యూరో, నవంబర్ 7 (జనంసాక్షి): హాకింపేట, లగచర్ల భూనిర్వాసితులకు కల్పించిన పరిహారాన్ని మక్తల్-నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం భూనిర్వాసితులకు కూడా వర్తింపజేయాలని భూనిర్వాసితుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శనివారం నారాయణపేట జిల్లా కేంద్రంలోని మున్సిపల్ పార్కు వద్ద ప్లకార్డులు పట్టుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘం గౌరవ అధ్యక్షుడు జి. వెంకట్రాంరెడ్డి, ఉపాధ్యక్షులు ధర్మరాజు గౌడ్, గోపాల్ రెడ్డి, గోపాల్ మాట్లాడుతూ.. ఒకే జిల్లాకు చెందిన భూనిర్వాసితులకు ప్రభుత్వం రెండు రకాల న్యాయాలు చేయడం సరికాదన్నారు. హాకింపేట, లగచర్లలో ఎకరాకు రూ.25 లక్షల పరిహారంతో పాటు ప్లాట్లు, ఇందిరమ్మ ఇళ్లు తదితర ప్రయోజనాలు కల్పిస్తున్నారని తెలిపారు. అదే ప్యాకేజీని ఎత్తిపోతల పథకం నిర్వాసితులకు కూడా వర్తింపజేయాలని కోరారు. తమపై వివక్ష చూపకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైఖరి మార్చుకోవాలని డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం ముఖ్యమంత్రికి వినతిపత్రం అందజేయాలని సమావేశంలో నిర్ణయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘం సలహాదారు బండమీది బలరాం, నాయకులు నర్సింలు, ఆంజనేయులు, లక్ష్మీకాంత్, మహేష్ కుమార్ గౌడ్, మొగులప్ప, నారాయణ, రవి, వెంకటప్ప, కురుమూర్తి, రాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దగూడెంలో 35 మందికి ఇందిరమ్మ ప్లాట్ల పట్టాల పంపిణీ



- సీఎం రేవంత్‌రెడ్డి జన్మదినం సందర్భంగా కార్యక్రమం
- మిగిలిన అర్హులకు త్వరలో లక్కీడిప్ ద్వారా కేటాయింపు: డీసీసీ అధ్యక్షుడు శివసేనారెడ్డి

వనపర్తి బ్యూరో, నవంబర్ 7 (జనంసాక్షి): ఏళ్ల తరబడి సొంతింటి కోసం ఎదురుచూస్తున్న నిరుపేద కుటుంబాల కలను సాకారం చేసే దిశగా ప్రజా ప్రభుత్వం మరో దడుగు వేసింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని శనివారం పెద్దగూడెం గ్రామంలో ఇందిరమ్మ ఇంటి స్థలాల పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, వనపర్తి డీసీసీ అధ్యక్షుడు శివసేనారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై తొలి విడతలో 35 మంది లబ్ధిదారులకు పట్టాలను అందజేశారు.ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు శివసేనారెడ్డి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి జన్మదినం సందర్భంగా ఇల్లు లేని నిరుపేదలకు ఇంటి స్థలాల పట్టాలు పంపిణీ చేయడం సంతోషకరమన్నారు. ప్రజా ప్రభుత్వం పేదల సంక్షేమం, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని పేర్కొన్నారు. సొంతింటి కోసం ఏళ్లుగా ఎదురుచూస్తున్న పేదలకు ఇంటి స్థలాలు అందించడం ద్వారా వారి జీవితాల్లో కొత్త ఆశలు చిగురిస్తున్నాయని తెలిపారు.ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామాల్లోని సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. పెద్దగూడెం గ్రామంలో మొత్తం 145 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ప్లాట్లు కేటాయించాల్సి ఉండగా, తొలి విడతలో 35 మందికి పట్టాలు అందజేసినట్లు వెల్లడించారు.



మిగిలిన అర్హులైన లబ్ధిదారులకు త్వరలో గ్రామపంచాయతీ కార్యాలయంలో లక్కీడిప్ నిర్వహించి పారదర్శకంగా ప్లాట్లు కేటాయిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్, ఆర్డీవో సుబ్రహ్మణ్యం, తహసీల్దార్ రమేష్ రెడ్డి, పెద్దగూడెం సర్పంచ్ పుష్పలత శివకుమార్, ఉపసర్పంచ్ పోలికమ్మ, మాజీ సర్పంచ్ జానకి కొండన్న, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు,గ్రామస్తులు పాల్గొన్నారు.

యాసంగిలో వరికి బదులుగా ఆరుతడి పంటలను సాగు చేయాలి వ్యవసాయ విస్తరణ అధికారి



నిజాంపేట్, నవంబర్ 07 (జనంసాక్షి): రాబోయే యాసంగి సీజన్‌లో రైతులు వరికి బదులుగా ఆరుతడి పంటలను సాగుచేయాలని వ్యవసాయ విస్తరణ అధికారి సూచించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి డి.వంశీవర్ధన్ మాట్లాడుతూ, ఎల్‌నినో ప్రభావం, వర్షపాతం లోటు కారణంగా భూగర్భ జలమట్టాలు తగ్గుతున్న నేపథ్యంలో రైతులు అధిక నీటి వినియోగం అవసరమయ్యే వరి పంట సాగును నివారించాలని సూచించారు.
వరికి ప్రత్యామ్నాయంగా తక్కువ నీటితో సాగు చేయగల శనగ, కుసుమ, వివిధ పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు మరియు కూరగాయల పంటలను సాగు చేయాలని రైతులకు వివరించారు. తక్కువ నీటితో అధిక దిగుబడి వచ్చే పంటలను ఎంచుకోవడం ద్వారా రైతులు లాభాలు పొందవచ్చని తెలిపారు.
ఈ కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మి శ్రీకాంత్, వార్డు మెంబర్లు శంకర్, దేవసాయం, కాంగ్రెస్ నాయకులు సీమోన్, చాకలి శివ, రాజశేఖర్ ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు

మండల ప్రజలు దీపావళి పండుగను ఘనంగా జరుపుకోవాలి

- కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు అగారం ప్రకాష్



ఖిల్లా ఘనపురం, నవంబర్ 7 (జనంసాక్షి): మండల ప్రజలందరూ దీపావళి పండుగను తమ కుటుంబ సభ్యులతో కలిసి సుఖసంతోషాల మధ్య అంగరంగ వైభవంగా జరుపుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు అగారం ప్రకాష్ ఆకాంక్షించారు.ఆయన మాట్లాడుతూ.. దీపావళి పండుగ వేళ స్థానిక దేవాలయాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దేవాలయాల సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరి జీవితాల్లో దీపావళి వెలుగులు నింపాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.
ఈ సందర్భంగా మండల ప్రజలకు, నాయకులకు, కార్యకర్తలకు, శ్రేయోభిలాషులకు అగారం ప్రకాష్ దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

మంత్రి దామోదర్ పై ఆరోపణలు సరికాదు

- ఆత్మ కమిటీ చైర్మన్ ఎన్ కచుర్ రావు



రాయికోడు,నవంబర్ 7 (జనంసాక్షి): సిడబ్ల్యుసి సభ్యులు, సీనియర్ నేత రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పై తప్పుడు ప్రచారాలు మానుకోవాలని ఆత్మ కమిటీ చైర్మన్ ఎన్ కచుర్రావు డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా శనివారం చైర్మన్ కచుర్రావు మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఉప ముఖ్యమంత్రిగా పనిచేసిన అనుభవం, ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ రూపకర్త,ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు లో కీలకపాత్ర పోషించినటువంటి సీనియర్ నాయకులు దామోదర్ రాజనర్సింహ నే అని ఆయన అన్నారు. ఆరు దశాబ్దాలుగా దామోదర్ రాజనర్సింహ కుటుంబం ఆందోల్ నియోజకవర్గం ప్రజలకు, కాంగ్రెస్ పార్టీకి పదవిలో ఉన్న పదవిలో లేకున్నా ఎనలేని సేవ లందిస్తున్నారని గుర్తు చేశారు.దామోదర్ అంటే అభివృద్ధి ప్రదాత అని తెలిపారు. అలాంటి నాయకుని పై తప్పుడు ప్రచారం నిర్వహిస్తే సహించేది లేదని ఆయన హెచ్చరించారు.

మొదలకుంట తండాలో పశువులకు వ్యాక్సినేషన్ క్యాంప్



నిజాంపేట్, నవంబర్ 07 (జనంసాక్షి): నిజాంపేట్ మండలం మొదల కుంట తండాలో పశువులకు ఉచిత వ్యాక్సినేషన్ క్యాంప్ నిర్వహించారు. సర్పంచ్ పిలుపు మేరకు ఏర్పాటు చేసిన ఈ క్యాంపులో పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేసి, వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నేతాజీ, తుకారాం, సాయిలు, అశోక్, సంతోష్, సర్పంచ్ సబిత చందర్ నాయక్, ఉప సర్పంచ్ సక్కుబాయి మురళి, వార్డు సభ్యులు లక్ష్మణ్, ధనసింగ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సిర్గాపూర్ లో 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' స్టిక్కరింగ్

- సర్పంచ్ శ్రీనివాసరావు పాటిల్ ప్రారంభం
- లబ్ధిదారు రమ్య ఇంటికి స్టిక్కర్ అతికించి శుభాకాంక్షలు

సిర్గాపూర్, నవంబర్ 7(జనంసాక్షి): సిర్గాపూర్ మండల కేంద్రంలో నిర్మించిన ఇందిరమ్మ ఇంట్లో స్థానిక సర్పంచ్ శ్రీనివాసరావు



పాటిల్ శనివారం స్టిక్కరింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. లబ్ధిదారు రమ్య ఇంటికి "మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి" స్టిక్కర్ ను అతికించి శుభాకాంక్షలు తెలిపారు. పేదల సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్ నామ్ దేవ్, కాంగ్రెస్ నాయకుడు కృష్ణ, పలువురు లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ లబ్ధిదారులతో దీపావళి సంబరాలు జరపాలి



రాయికోడు, నవంబర్ 7 (జనంసాక్షి): ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులు దీపావళి సంబరాలు నిర్వహించుకోవాలని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పి.కేదార్నాథ్ పాటిల్ కోరారు. పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశాల మేరకు సర్పంచులు, ప్రజాప్రతినిధులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు లబ్ధిదారుల ఇళ్ల వద్ద బ్యానర్లు ఏర్పాటు చేసి వేడుకల్లో పాల్గొనాలని సూచించారు.

పండ్ల వ్యాపారులకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు



- పాత గంజిలో తాత్కాలిక షెడ్లు ఏర్పాటు చేస్తాం
- రోడ్డు విస్తరణ అనంతరం అదే ప్రాంతంలో శాశ్వత దుకాణాలు నిర్మించి ఇస్తాం: ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

వనపర్తి బ్యూరో, నవంబర్ 6 (జనంసాక్షి): పట్టణంలో పాలిటెక్నిక్ కళాశాల రోడ్డు విస్తరణ పనుల నేపథ్యంలో డిపో రోడ్డులో వ్యాపారాలు నిర్వహిస్తున్న పండ్ల వ్యాపారులకు ఎలాంటి ఇబ్బందులు, ఆర్థిక నష్టం కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు శనివారం పట్టణంలోని పండ్ల వ్యాపారులతో ఎమ్మెల్యే ప్రత్యేకంగా సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రోడ్డు విస్తరణ పనుల కారణంగా వ్యాపారులు ఉపాధి కోల్పోకుండా వనపర్తి పాత మార్కెట్ యార్డు (పాత గంజి)లో తాత్కాలిక షెడ్లు ఏర్పాటు చేసి వ్యాపారాలు కొనసాగించుకునేలా తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. రోడ్డు విస్తరణ పనులు పూర్తయిన అనంతరం ప్రస్తుతం వ్యాపారాలు నిర్వహిస్తున్న ప్రాంతంలోనే శాశ్వత దుకాణాలు ఏర్పాటు చేసి ఇస్తామని వ్యాపారులకు ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. అభివృద్ధి పనుల సమయంలో చిరు వ్యాపారుల జీవనోపాధికి ఎలాంటి ఆటంకం కలగకుండా ప్రభుత్వం, మున్సిపల్ యంత్రాంగం సమన్వయంతో చర్యలు తీసుకుంటాయని స్పష్టం చేశారు.

పట్టణాభివృద్ధికి అందరి సహకారం అవసరం...


వనపర్తి పట్టణంలో పెరుగుతున్న జనాభా, వాహనాల రద్దీకి అనుగుణంగా రహదారుల విస్తరణ ఎంతో అవసరమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మెరుగైన రహదారులు, సులభమైన రవాణా సౌకర్యాలు, ట్రాఫిక్ సమస్యల పరిష్కారం పట్టణ అభివృద్ధికి దోహదపడతాయని తెలిపారు. పట్టణ అభివృద్ధి ఒక్కరి బాధ్యత కాదని, ప్రతి ఒక్కరి భాగస్వామ్యంతోనే సాధ్యమవుతుందని పేర్కొంటూ రోడ్డు విస్తరణ పనులకు వ్యాపారులు, స్థానిక ప్రజలు సానుకూలంగా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అభివృద్ధి పనులతో పాటు చిరు వ్యాపారుల ఉపాధి, ప్రయోజనాలను కూడా దృష్టిలో ఉంచుకుని ముందుకు సాగుతామని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వనపర్తి మున్సిపల్ వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, పట్టణ అధ్యక్షుడు కదిరె రాములు, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు తిరుపతయ్య, జనరల్ సెక్రటరీ బ్రహ్మంచారి, పెబ్బేరు మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, ఏర్పుల రవి యాదవ్, క్రాంతి గౌడ్, యూత్ అధ్యక్షుడు వాకిటి ఆదిత్య, ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు శ్రీకాంత్, రఘు యాదవ్, పాల రవి, నక్క రాములు, చుక్క రాజు, బి.కృష్ణ తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



చేర్యాల, నవంబర్ 7 (జనంసాక్షి): చేర్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొమ్మూరి ప్రశాంత్ రెడ్డి శనివారం దూలిమిట్ట, మద్దూరు మండలాల పరిధిలోని కమలాయపల్లి, అర్జున్‌పట్ల, జాలపల్లి, దూలిమిట్ట, లింగాపూర్, తోర్నాల, బెక్కల్, హనుమంతండా, కొండాపూర్, బైరాన్‌పల్లి, మర్మాముల గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోళ్లు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, ప్రజాప్రతినిధులు, రైతులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సత్యం కుటుంబానికి అండగా ఉంటాం: హరీష్ రావు



సంగుసూర్ (జనంసాక్షి): అనారోగ్యంతో మృతిచెందిన అప్పలాయి చెరువు గ్రామ సర్పంచ్ సత్యం ముదిరాజ్ కుటుంబాన్ని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు శనివారం పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి, సత్యం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి సత్యం చేసిన సేవలు మరువలేనివని, ఆయన మరణం గ్రామానికి, పార్టీకి తీరని లోటని అన్నారు. సత్యం కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని, ఏ కష్టం వచ్చినా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా.. ఎలికట్టలో స్వచ్ఛ జలధార కార్యక్రమం



కల్వకుర్తి, నవంబర్ 07 (జనంసాక్షి): కల్వకుర్తి మండలం ఎలికట్ట గ్రామంలో ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్వచ్ఛ జలధార కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ప్రజలకు పరిశుభ్రమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి సహకారంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. మూడవ విడతలో భాగంగా ఎలికట్ట గ్రామపంచాయతీ పరిధిలోని తాగునీటి నిల్వ ట్యాంకులను ప్రత్యేక యంత్రాల సహాయంతో శుభ్రపరిచారు. జర్మన్ సాంకేతికతతో కూడిన ఆధునిక యంత్రాల ద్వారా ట్యాంకుల్లో పేరుకుపోయిన మురికి, వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతిలో తొలగించి పరిశుభ్రం చేశారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణతో పాటు స్వచ్ఛమైన తాగునీటి నాణ్యతను మెరుగుపరచడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. కల్వకుర్తి నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లో దశలవారీగా ఈ కార్యక్రమాన్ని కొనసాగించనున్నారు. ఈ కార్యక్రమంలో యాలికట్ట గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్, ఐక్యత ఫౌండేషన్ ప్రతినిధి బంగారయ్య, వార్డు సభ్యులు, యువకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నెల రోజులుగా మూతపడిన పురాతన వీరభద్ర ఆలయం!



- పురోహితుడు, అర్చకుడి మధ్య విభేదాలతో నిలిచిన నిత్య పూజలు
- ఆలయానికి పూర్వ వైభవం తీసుకురావాలని గ్రామస్తుల వేడుకోలు

కొల్చారం, నవంబర్ 7 (జనంసాక్షి): మండల కేంద్రంలోని పురాతన వీరభద్ర స్వామి ఆలయం వివాదాల కారణంగా గత నెల రోజులుగా మూతపడింది. గ్రామ పురోహితుడు, ఆలయ అర్చకుడి మధ్య తలెత్తిన విభేదాలతో ఆలయంలో నిత్యం జరగాల్సిన ధూపదీప నైవేద్యాలు, అర్చనలు, అభిషేకాలు నిలిచిపోయాయి. దీంతో భక్తుల రాకపోకలతో కళకళలాడాల్సిన ఆలయం ప్రస్తుతం బోసిపోయి, పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. గ్రామానికి చెందిన పురోహితుడు, మరో గ్రామానికి చెందిన ఆలయ అర్చకుడి మధ్య వ్యక్తిగత విభేదాలు తలెత్తినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. ఈ విభేదాల ప్రభావం ఆలయ నిర్వహణపై పడటంతో స్వామివారి నిత్య పూజలు నిలిచిపోవడంపై భక్తులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఒకప్పుడు దీపావళి వంటి పర్వదినాల్లో ప్రత్యేక పూజలు, దీపాలంకరణలతో వెలుగులు విరజిమ్మిన ఆలయం ప్రస్తుతం భక్తులు లేక వెలవెలబోతోంది. ఆలయం మూతపడటంతో పాటు పరిసరాలు చెత్తాచెదారంతో నిండిపోవడం గ్రామస్తులను కలచివేస్తోంది. దేవాలయాలు కులమతాలు, వ్యక్తిగత విభేదాలకు అతీతంగా ఆధ్యాత్మికతకు నిలయాలుగా ఉండాలని గ్రామస్తులు అభిప్రాయపడుతున్నారు. వ్యక్తుల మధ్య ఉన్న సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకుని ఆలయ పవిత్రత, సంప్రదాయాలను కాపాడాలని కోరుతున్నారు. ఇప్పటికైనా దేవాదాయ శాఖ అధికారులు, గ్రామ పెద్దలు స్పందించి ఇరువర్గాల మధ్య ఉన్న విభేదాలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఆలయాన్ని తిరిగి తెరిపించి నిత్య ధూపదీప నైవేద్యాలు, పూజలు యథావిధిగా జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. వీరభద్ర స్వామి ఆలయం పూర్వ వైభవంతో భక్తులతో కళకళలాడేలా గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

పెంట్లవెల్లిని కరువు మండలంగా ప్రకటించాలి

- ఎకరాకు రూ.50 వేల నుంచి రూ.35 వేల వరకు పంట నష్టపరిహారం ఇవ్వాలి



పెంట్లవెల్లి, నవంబర్ 6 (జనంసాక్షి): పెంట్లవెల్లి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని రైతు సంఘం, కేజీకేఎస్, కేవీపీఎస్ ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆర్ఐ జానయ్యకు వినతిపత్రం అందజేశారు. వాణిజ్య పంటలకు ఎకరాకు రూ.50 వేలు, వరి తదితర సాధారణ పంటలకు రూ.35 వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని కోరారు. రేషన్ దుకాణాల ద్వారా 14 రకాల నిత్యావసర వస్తువులను ఉచితంగా పంపిణీ చేయడంతో పాటు ఒక్కొక్కరికి 12 కిలోల బియ్యం అందించాలని డిమాండ్ చేశారు. జూరాల చివరి ఆయకట్టు పరిధిలో సాగునీరు అందకవరి, కంది, మినుము, వేరుశనగ పంటలు ఎండిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణను కరువు ప్రాంతంగా ప్రకటించి కేంద్రం నిధులు విడుదల చేయాలని కోరారు. స్థానిక మంత్రి జూపల్లి కృష్ణారావు చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. లేనిపక్షంలో రైతులతో కలిసి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కేజీకేఎస్ జిల్లా కన్వీనర్ ఎల్లగౌడ్, హన్మంతు, బండారు శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, ధర్మరాజు, రవి, కురుమయ్య, షేక్ షావలి తదితరులు పాల్గొన్నారు.

కలం మిత్రుల అభినందన..! చైర్మన్ భూపతి రెడ్డికి పాత్రికేయుల ఘన సన్మానం



వెల్దండ, నవంబర్ 07 (జనంసాక్షి): వెల్దండ మండలం సింగిల్ విండో చైర్మన్ గా ఎన్నికైన యెన్నం భూపతి రెడ్డిని పాత్రికేయ మిత్రులు శనివారం ఘనంగా సన్మానించారు. శాంపూరి శ్రీనివాస్, దండు జగన్, రామాంజనేయులు తదితర పాత్రికేయ మిత్రులు పాల్గొని చైర్మన్ భూపతి రెడ్డిని శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా చైర్మన్ భూపతి రెడ్డి మాట్లాడుతూ.. నమ్మకంతో చైర్మన్‌గా ఎన్నుకున్న పెద్దలకు, అభినందనలు తెలిపిన పాత్రికేయ మిత్రులకు హృదయపూర్వక కృతజ్ఞతలు. రైతులే నా ప్రాధాన్యత. సింగిల్ విండో ద్వారా రైతులకు సకాలంలో ఎరువులు, విత్తనాలు, మందులు అందేలా చూస్తా రైతు సంక్షేమమే నా లక్ష్యం అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాత్రికేయ మిత్రులు మాట్లాడుతూ.. రైతుల సమస్యలు మా దృష్టికి వస్తే వెంటనే పరిష్కరించాలి. సింగిల్ విండోలో పారదర్శకత ఉండాలి. చిన్న,సన్నకారు రైతులకు ప్రాధాన్యత ఇవ్వాలి. మా వంతుగా రైతుల గొంతుకగా నిలుస్తాం అని సూచించారు. సింగిల్ విండో అభివృద్ధికి, రైతుల సంక్షేమానికి అందరూ కలిసి పనిచేయాలని ఈ సందర్భంగా కోరారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కును లబ్ధిదారునికి అందజేసిన సర్పంచ్




వెల్దండ, నవంబర్ 07 (జనంసాక్షి): కొత్ర గ్రామానికి చెందిన దేశమోని మల్లేష్‌కు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కును గ్రామ సర్పంచ్ శారద చెన్నయ్య లబ్ధిదారునికి అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు జెనిగల సాయి యాదవ్, శంపూరి సత్యం, కొప్ప మల్లేష్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు జెనిగల మల్లయ్య, రాజు యాదవ్, మడ్డి కరుణాకర్, బూతుకూరి శివకృష్ణ, లక్ష్మమ్మ, రజియా బేగం తదితరులు పాల్గొన్నారు.



హత్య కుట్రను భగ్నం చేసిన పోలీసులు.. నలుగురు అరెస్ట్

పెంట్లవెల్లి, నవంబర్ 7 (జనంసాక్షి): పాత రాజకీయ, వ్యక్తిగత కక్షల నేపథ్యంలో కొండూరు గ్రామానికి చెందిన నల్లబోతుల గోపాల్‌ను హతమార్చేందుకు కుట్ర పన్నిన వ్యవహారాన్ని పెంట్ల వెల్లి పోలీసులు ఛేదించారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్లో కొల్లాపూర్ సిఐ శంకర్ విలేఖరుల సమావేశంలో నిందితులను హాజరు పరిచారు. ఈ కేసులో కావలి శివకుమార్ (36), నల్ల బోతుల నాగేశ్ (20), నాగరాజు (40), బాలు (22)లను అరెస్ట్ చేసి నిందితుల నుంచి నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నా మన్నారు. నల్లపోతుల గోపాల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు Cr.No.69/2026, BNS సెక్షన్ 61(2) r/w 62 కింద కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ పేర్కొన్నారు.

పారిశ్రామిక కాలుష్యానికి మూగజీవి బలి!



గామస్తుల కథనం ప్రకారం.. మేత కోసం వెళ్లిన గేదె పరిశ్రమ పరిసరాల్లో ఉన్న రసాయనాలతో కలుషితమైన నీటిని తాగిన అనంతరం మృతి చెందినట్లు తెలిపారు. దీంతో ఆగ్రహానికి గురైన గ్రామస్తులు మృతి చెందిన గేదెను పరిశ్రమ ప్రధాన గేటు ఎదుట ఉంచి ఆందోళనకు దిగారు.

పరిశ్రమల నుంచి వెలువడుతున్న వ్యర్థ జలాలపై తక్షణమే అధికారులు స్పందించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. రసాయన వ్యర్థ జలాల ప్రభావంపై సమగ్ర విచారణ చేపట్టి, నీటి నమూనాలను సేకరించి ప్రయోగశాలలో పరీక్షించాలని కోరుతున్నారు. గేదె మృతికి అసలు కారణాలను నిర్ధారించి బాధిత రైతుకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

కాలుష్య నియంత్రణ మండలి అధికారులు వెంటనే స్పందించి పరిశ్రమ పరిసరాల్లో తనిఖీలు నిర్వహిస్తారా? లేక మరో మూగజీవి బలయ్యే వరకు వేచి చూస్తారా? అని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు.

టపాసుల షాపుల కోసం వసూళ్ల పర్వం



నారాయణఖేడ్ పట్టణంలో టపాసుల షాపుల కోసం ఒక్కో శాఖకు ఇంత అని మామూళ్ల పర్వం కొనసాగింది. టపాసుల షాప్ అంటేనే చాలా జాగ్రత్తగా, ఎటువంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తుగా కట్టుదిట్టమైన సేఫ్టీ చర్యలు చేపట్టిన అనంతరం లైసెన్స్ ఇవ్వాల్సిన మున్సిపల్, రెవెన్యూ, ఫైర్ డిపార్ట్‌మెంట్ శాఖల వారు మామూళ్ల మత్తులో కొనసాగుతూ యదేచ్ఛగా లైసెన్స్ లు ఇచ్చి ప్రజల ప్రాణాలతో చెలగాట మాడుతున్నారు. నారాయణఖేడ్ పట్టణంలోని తహసిల్ మైదానంలో దాదాపు 25 టపాసుల షాపులు ఏర్పాటు చేసినప్పటికీ ఏ ఒక్క షాపు కూడా నియమ నిబంధనకు అనుకూలంగా లేకపోవడం టెంట్లు, టార్పలిన్లు, వాడడంతో అనుకోకుండా ప్రమాదం జరిగితే అక్కడున్న షాపులతో పాటు ఆఫీసులు కూడా దగ్ధమయ్యే ప్రమాదం ఉందని ప్రజల ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి టపాసుల షాపులను ఊరి చివర లేదా నియమ నిబంధనకు లోబడి అమ్మకాలు చేపట్టాల్సిందిగా చర్యలు తీసుకోవాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

రూ.14.26 కోట్ల ప్రభుత్వ ధాన్యం ఏమైంది?

మీడియాకు సమాచారం ఎందుకు అందడం లేదు?

ప్రజాధనానికి సంబంధించిన ఇంతటి భారీ వ్యవహారాలు వెలుగులోకి వస్తున్నా మీడియాకు పూర్తి సమాచారం అందకపోవడం అనుమానాలకు తావిస్తోంది. అధికారులు తనిఖీలు నిర్వహించినప్పుడు వివరాలను పారదర్శకంగా వెల్లడించాల్సిన అవసరం ఉంది. ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన అంశాలను ప్రజలకు తెలియజేయడంలో మీడియాకు సహకరించాలి.సమాచారం గోప్యంగా ఉంచాల్సిన పరిస్థితి ఎందుకు వస్తోంది? తనిఖీల వివరాలు బయటకు రాకుండా అడ్డుకుంటున్న దెవరు? అన్న ప్రశ్నలకు సంబంధిత అధికారులు సమాధానంచెప్పాలి.ప్రజాధనానికి సంబంధించిన ఇంతటి భారీ వ్యవహారాలు వెలుగులోకి వస్తున్నా మీడియాకు పూర్తి సమాచారం అందకపోవడం అనుమానాలకు తావిస్తోంది. అధికారులు తనిఖీలు నిర్వహించినప్పుడు వివరాలను పారదర్శకంగావెల్లడించాల్సిన అవసరం ఉంది.ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన అంశాలను ప్రజలకుతెలియజేయడంలో మీడియాకు సహకరించాలి. సమాచారం గోప్యంగా ఉంచాల్సిన పరిస్థితి ఎందుకు వస్తోంది? తనిఖీల వివరాలు బయటకు రాకుండాఅడ్డుకుంటున్నదెవరు? అన్న ప్రశ్నలకు సంబంధిత అధికారులు సమాధానం చెప్పాలి.

బియ్యం బ్లాక్ దందాకు అడ్డుకట్ట ఏది?

మరోవైపు బియ్యం వ్యాపారులు అధిక ధరలకు విక్రయిస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ఒకవైపు ప్రభుత్వ ధాన్యం నిల్వల్లో భారీ కొరత..మరోవైపు బియ్యం ధరల విషయంలో వినియోగదారులపై భారం పడుతోందనే ఆందోళన వ్యక్తమవు తోంది. బియ్యం బ్లాక్ దందాకు అడ్డుకట్ట వేసేదెవరు?వ్యాపారులు ఇష్టారాజ్యంగా ధరలు పెంచి విక్రయిస్తే నియంత్రించాల్సిన పౌరసరఫరాల శాఖ ఏం చేస్తోంది? నిత్యావసర సరుకుల ధరలపై నిరంతర నిఘా ఎందుకు ఉండటం లేదు?అనే ప్రశ్నలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి.అయితే అధిక ధరల విక్రయాలపై నిర్దిష్ట ఆధారాలతో అధికారులు విచారణ చేపట్టాల్సి ఉంది.

కేసు నమోదు..దర్యాప్తు ప్రారంభం

నాగర్ కర్నూల్ జిల్లా పౌరసరఫరాలశాఖ మేనేజర్ దండు రాజేందర్ ఫిర్యాదు మేరకు కల్వకుర్తి పోలీస్‌స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 391/2026గా కేసు నమోదు చేశారు. భారతీయ న్యాయసంహిత సెక్షన్లు316(2),316(5),318(3), నిత్యావసర సరుకుల చట్టంలోని సెక్షన్ 7 కింద మిల్లు నిర్వాహకులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మరోవైపు బియ్యం వ్యాపారులు అధిక ధరలకు విక్రయిస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ఒకవైపు ప్రభుత్వ ధాన్యం నిల్వల్లో భారీ కొరత..మరోవైపు బియ్యం ధరల విషయంలో వినియోగదారులపై భారం పడుతోందనే ఆందోళన వ్యక్తమవుతోంది.

కేసు నమోదు..దర్యాప్తు ప్రారంభం..తప్పు చేస్తే కఠిన చర్యలు తప్పవు

ప్రభుత్వ ధాన్యాన్ని దుర్వినియోగం చేయడం, అక్రమంగా మళ్లించడం, ప్రజా పంపిణీ వ్యవస్థకు నష్టం కలిగించే చర్యలకు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని కల్వకుర్తి ఎస్ఐ కురుమూర్తి హెచ్చరించారు.ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించే వారిని ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు.

ప్రజల ప్రశ్నలకు సమాధానాలేవి?

పేదలకు అందాల్సిన రేషన్ బియ్యం, రైతుల నుంచి సేకరించిన ప్రభుత్వ ధాన్యం విషయంలో పారదర్శకత ఉండాలి. కోట్లాది రూపాయల విలువైన ధాన్యం కొరతపై సమగ్ర విచారణ జరిపి, నిల్వల్లో తేడాకు కారణాలను వెల్లడించాలి. బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు బియ్యం వ్యాపారుల ధరల నియంత్రణపై కూడా అధికారులు దృష్టి సారించాలి. ప్రజా పంపిణీ వ్యవస్థలో అక్రమాలకు తావులేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

సిర్గాపూర్ తండా బిడ్డకు రాష్ట్రస్థాయి గోల్డ్ మెడల్

- **SGF అండర్-17 బ్యాడ్మింటన్‌లో సత్తాచాటిన మధుప్రియ - గైరాన్ తండా**



సిర్గాపూర్, నవంబర్ 7 (జనంసాక్షి): సిర్గాపూర్ మండలం గైరాన్ తండా (W) గ్రామానికి చెందిన విద్యార్థిని మధుప్రియ రాష్ట్రస్థాయి SGF అండర్-17 బ్యాడ్మింటన్ పోటీల్లో బంగారు పతకం సాధించి మండలం పేరును రాష్ట్ర స్థాయిలో మారుమోగించింది.చిన్న వయసులోనే క్రీడలపై మక్కువతో, ప్రతిరోజూ కఠిన సాధన చేస్తూ ఈ విజయాన్ని అందుకున్నట్లు కోచ్ సాయికిరణ్ తెలిపారు. మధుప్రియ క్రమశిక్షణ, పట్టుదల, గెలుపుపై ఉన్న ధ్యాసే ఈ బంగారు పతకానికి కారణమని ఆయన అన్నారు.మధుప్రియ విజయ వార్త తెలియగానే తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. గ్రామంలో సంబరాలు జరుపుకున్నారు. పలువురు ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, క్రీడాకారులు ఆమెను అభినందించారు.గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చి ఇంత పెద్ద విజయం సాధించడం గర్వకారణమని, మధుప్రియ భవిష్యత్తులో జాతీయ స్థాయిలో కూడా రాణించి జిల్లాకు మరింత పేరు తీసుకురావాలని గ్రామస్తులు ఆకాంక్షిస్తున్నారు.

నా భూమి నాకు ఇప్పించి న్యాయం చేయండి

- **బాధిత రైతు నర్సింహాచారి వేడుకోలు**



చేర్యాల/ ధూల్మిట్ట, నవంబర్ 07 (జనంసాక్షి): తన భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకుని కబ్జా చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకొని తన భూమి తనకు ఇప్పించాలని కోరుతూ బాధిత రైతు వలబోజు నర్సింహా చారి శనివారం మీడియాతో మాట్లాడుతూ ఆవేదన వ్యక్తం చేశాడు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని జాలపల్లి గ్రామ శివారులో గల 1-06 ఎకరం ఆరు గుంటల



వ్యవసాయ భూమిని చేరుపల్లి ధర్మారెడ్డి అనే రియాల్టర్ నన్ను నమ్మబలికి ఆక్రమించుకోవా లని చూస్తూ దౌర్జన్యంగా కడీలు నాటి నన్ను నా కుటుంబాన్ని భయాందోళనకు గురి చేస్తూ భూమిలోకి ప్రవేశించకూడదని బెదిరింపులకు పాల్పడుతూ తన కుటుంబాన్ని మానసికంగా వేధిస్తున్నాడంటూ బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. తన తండ్రి వారసత్వంగా వస్తున్న తన వాటకు వచ్చే పట్టా భూమిని తన ప్రమేయం లేకుండా అన్యాయంగా రిజిస్ట్రేషన్ చేసుకుని ఇబ్బందులకు గురి చేస్తున్నాడని బాధితుడు కన్నీటి పర్యంతమయ్యాడు. ఇప్పటికైనా రెవెన్యూ, పోలీస్ శాఖ అధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని వేడుకున్నాడు.

ఇంటర్మీడియట్ విద్య భవిష్యత్తుకు పునాది...



మల్దకల్, నవంబర్ 7 (జనంసాక్షి): ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ శ్రీలతారెడ్డి అధ్యక్షతన ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ద్వితీయ సంవత్సరం విద్యార్థులు స్వాగత వేడుక నిర్వహించారు. ముఖ్య అతిథి డీఐఈఓ హృదయరాజు మాట్లాడుతూ ఇంటర్మీడియట్ విద్య భవిష్యత్తుకు పునాది అని, మార్కులతో పాటు సంస్కారవంతమైన విద్యను అభ్యసించాలని సూచించారు. ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని తెలిపారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ గత ఏడాది ఉత్తీర్ణతలో కళాశాల జిల్లాలో మొదటి స్థానంలో నిలిచిందని, ఈసారి కూడా అదే ఫలితాన్ని సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కరాటేతో ఎదుగుదల: గణేష్ మాస్టర్



పాపన్నపేట, నవంబర్ 7 (జనంసాక్షి): కరాటే నేర్చుకోవడం వలన శారీరక,మానసిక ఎదుగుదల ఉంటుందని మాస్టర్ నగేష్ పేర్కొన్నారు. శనివారం కుర్తివాడ గ్రామంలో రెంజుకి షోటోకాన్ క్రీడలు కరాటే అకాడమీ ఆధ్వర్యంలో బెల్ట్ గ్రేడింగ్ పోటీ నిర్వహించారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు బెల్టులు ప్రదా నం చేశారు. మణి, నాగేందర్, మల్లేష్ మాస్టర్లు పరీక్షకులుగా వ్యవహరించారు. గ్రామ సర్పంచ్ శ్రీధర్,మాజీ ఎంపీటీసీ రమేష్ గౌడ్ మాస్టర్ల ను సన్మానించారు.

ప్రమాదంలో గాయపడిన పట్నం సత్యానికి కాంగ్రెస్ నాయకుల పరామర్శ

- **మంత్రి జూపల్లి కృష్ణారావు చొరవతో బాధితుడికి సకాలంలో వైద్య సహాయం**



పెద్దకొత్తపల్లి, నవంబర్ 7 (జనంసాక్షి): పెద్దకొత్తపల్లి మండలం కల్వకోల్ గ్రామానికి చెందిన పట్నం సత్యం ఇటీవల ప్రమాదవ శాత్తు కిందపడటంతో కాలు విరిగింది. దీంతో ఆయన నాగర్ కర్నూల్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేరారు.ఈ విషయం తెలుసుకున్న కల్వకోల్ గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు వెంటనే స్పందించి రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి జూపల్లి కృష్ణారావు సూచనల మేరకు ఆసుపత్రి వైద్యులతో మాట్లాడటంతో వైద్యులు వెంటనే స్పందించి పట్నం సత్యానికి శస్త్రచికిత్స నిర్వహించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆసుపత్రికి వెళ్లి పట్నం సత్యాన్ని పరామర్శిం చారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సకాలంలో స్పందించి మెరుగైన వైద్య సహాయం అందేలా చొరవ తీసుకున్న మంత్రి జూపల్లి కృష్ణారావుకు, అలాగే తనకు అండగా నిలిచి సహకరించిన కాంగ్రెస్ పార్టీ నాయకులకు పట్నం సత్యం ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కాటమోని బిచ్చన్న గౌడ్, మదన్ గోపాల్, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు పటిష్ట కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలి



- ఈ నెల 11వ తేదీ నుంచి గ్రామసభల ద్వారా ఎల్‌నినోపై ప్రజలకు అవగాహన కల్పించాలి
- ఇందిరమ్మ ఇళ్లలో దీపావళి పండుగను ఘనంగా జరుపుకునేలా చర్యలు తీసుకోవాలి
- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

మెదక్ బ్యూరో, నవంబర్ 7 (జనంసాక్షి): ఎల్‌నినో ప్రభావం వల్ల ఎదురయ్యే వాతావరణ మార్పులు, వర్షా భావ పరిస్థితులు, నీటి ఎద్దడి తదితర సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పటిష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలో మినీ సమావేశ మందిరంలో ఎల్ నీనో ప్రభావం దాన్ని ఎదు ర్కొనే అంశాల పై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..ఈ నెల 11వ తేదీ నుంచి జిల్లా లోని అన్ని గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి, ఎల్‌నినో ప్రభావం, దాని వల్ల కలిగే పరిణామాలు, తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. ముఖ్యంగా నీటి సంరక్షణ, వర్షపు నీటినిల్వ, నీటి వనరుల పరిరక్షణ, ప్రత్యామ్నాయ పంట విధానాలు తదితర అంశాలపై ప్రజలకు వివ రించాలని తెలిపారు. గ్రామస్థాయిలో ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు, గ్రామ కార్యదర్శులు సమన్వయంతో పనిచేస్తూ ఎల్‌నినో ప్రభావాన్ని తగ్గించేం దుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

ఇందిరమ్మ ఇళ్లలో దీపావళి పండుగ ఘనంగా జరగాలి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ఇళ్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారుల కుటుంబాల్లో దీపావళి పండుగ సంతోషంగా జరగాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పురో గతిని అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ, అర్హులైన లబ్ధిదారులకు అవసరమైన సహకారం అందించాలని సూచించారు. పండుగ సందర్భంగా ప్రతి కుటుంబంలో ఆనందం వెల్లివిరిసేలా అధికారులు క్షేత్రస్థాయిలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు.

ప్రజల సంక్షేమం, పర్యావరణ పరిరక్షణ, ప్రభుత్వ పథకాల సమర్థవంతమైన అమలే లక్ష్యంగా అన్ని శాఖల అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ నగేష్, జెడ్పీ సీఈవో ఎల్లయ్య, డిఆర్డిఓ శ్రీనివాసరావు, జిల్లా పంచాయతీ రాజ్ శాఖ అధికారి యాదయ్య, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి దేవ్ కుమార్, జిల్లా అధికారు లు పాల్గొన్నారు.

మెదక్ ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపిన తిరుపతిరెడ్డి



మెదక్, నవంబర్ 7 (జనంసాక్షి): దీపావళి పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో నూతన ఆశ లు, ఆనందాలు నింపా లని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి ఆకాంక్షిం చారు. దీపావళి పర్వదినా న్ని పురస్కరించుకుని మెదక్ జిల్లా ప్రజలకు శు భాకాంక్షలు తెలిపారు. ప్రతి ఇల్లు దీపాల కాంతులతో ప్రకా శించాలని, ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు వెల్లివిరియా లని కోరుకున్నారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే ఈ పండుగను కులమతాలకు అతీ తంగా ఐకమత్యం, సోదరభావంతో ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని పిలుపునిచ్చారు.

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఇంట్లో దీపావళి వెలుగులు

- కౌలంపేట్ 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' కార్యక్రమం

సంగారెడ్డి, నవంబర్ 7(జనంసాక్షి): రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారులకు అందించిన ఇందిరమ్మ ఇండ్లలో దీపావళి వేడుకలు జరుపుకున్నారు. కంది మండల పరిషత్ కార్యాలయంలో 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి పండుగ' కార్యక్రమానికి సంబంధిం చిన లోగోను అధికారులు ఆవిష్కరించారు.



అనంతరం కౌలంపేట్ గ్రామపంచాయతీ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఇళ్ల ముందు కార్యక్రమం లోగోను అతికించారు.



ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ పీడీ చలపతిరావు, ఎంపీడీవో శ్రీనివాస్, గృహ నిర్మాణ శాఖ అధికారి సుమ, గ్రామ సర్పం చ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, పంచా యతీ కార్యదర్శి పాల్గొన్నారు. ఈ సంద ర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ.. ఇందిర మ్మ ఇళ్ల పథకం ద్వారా ప్రభుత్వం రూ.5 లక్షల ఆర్థికసాయం అందించడంతో నూత నంగా ఇళ్లు నిర్మించుకున్నామని, సొంతింటి లో ఈ దీపావళి పండుగను జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందని సంతోషం వ్యక్తం చేశారు.

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో దీపావళి వేడుకలు జరపాలి

- ఈ నెల 9న రైతుమేళాను విజయవంతం చేయాలి: కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కేఎం నారాయణ

మహమ్మదాబాద్, నవంబర్ 7 (జనంసాక్షి): ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల కుటుంబాల్లో దీపావళి వెలుగులు నింపడంతో పాటు, ఈనెల 9న హకీంపేటలో నిర్వహించనున్న రైతుమేళా ను విజయవంతం చేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కేఎం నారాయణ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.





పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి. రామ్మోహన్ రెడ్డి సూచన మేరకు శనివారం మహమ్మదాబాద్ మండల కేంద్రంలో సర్పంచులు, కాంగ్రెస్ నాయకులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ప్రజలకు దీపావళి శు భాకాంక్షలు తెలిపారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మ కంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో లబ్ధి పొందిన కుటుంబాల ఇళ్లకు వెళ్లి వారితో కలిసి దీపావళి వేడుకలు జరుపు కోవాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని కోరారు.

రైతుమేళాకు భారీగా తరలిరావాలి...

ఈనెల 9న హకీంపేటలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన సంద ర్భంగా నిర్వహించనున్న రైతుమేళా సభకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, సర్పంచులు భారీ సంఖ్యలో తరలి రావాలని కేఎం నారాయణ కోరారు. రైతుల సంక్షేమమే లక్ష్యంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్క రూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గ్రామాల వారీగా పార్టీ శ్రేణులను సమీకరించి సభకు తరలించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీపీ శాంతి రంగ్య, సర్పంచుల సంఘం అధ్యక్షుడు జె. రామ్‌లాల్, ఆయా గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

వరుస ఘటనలతో

మోడల్ స్కూల్‌పై సన్నగిల్లుతున్న విశ్వాసం

- ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి దొంతరవేణి మహేష్



బెజ్జంకి,నవంబర్ 7(జనంసాక్షి): బెజ్జంకి మోడల్ స్కూల్‌లో వరుసగా చోటుచేసుకుంటున్న ఘటనలు విద్యార్థుల తల్లిదండ్రు ల్లో ఆందోళన కలిగిస్తున్నాయని ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి దొంతరవేణి మహేష్ అన్నారు. విద్యార్థుల భద్రత, పాఠశాల నిర్వహణపై జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి ఉన్నతస్థాయి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ పాఠశాలలో చోటుచేసుకుంటున్న ఘటన లకు బాధ్యులైన సిబ్బందిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని, అవసరమైతే ప్రస్తుత సిబ్బందిని మార్చి సమర్థులైన కొత్త సిబ్బందిని నియమించాలని కోరారు.మండల విద్యాశాఖ అధికారి పర్యవేక్షణ లోపంపై కూడా ఉన్నతాధికారులు దృష్టి సారించాలని అన్నారు.విద్యార్థుల భద్రతకు ప్రత్యేక చర్యలు చేపట్టి తల్లిదండ్రుల్లో పాఠశాలపై తిరిగి విశ్వాసం కల్పించాలని కోరారు.అధికారులు స్పందించకపోతే విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి ఏఐవైఎఫ్ ఆధ్వ ర్యంలో ప్రజా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

తాడూర్ మండలానికి సంబంధించిన వివిధ మోర్చాల అధ్యక్షుల ఎన్నిక







తాడూర్,(జనంసాక్షి): తాడూర్ మండల వివిధ మోర్చాల అధ్యక్షులగా నూత న బాధ్యతలు స్వీకరిస్తున్న తాడూరు మండల యువ మోర్చా అధ్యక్షుడిగా ఎన్నికైన భూశెట్టి మహేష్ మరియు తాడూర్ మండల కిసాన్ మోర్చా అధ్యక్షునిగా ఎన్నికైన జయవర్ధన్ మరియు తాడూరు మండల ఎస్సీ మోర్చా అధ్యక్షునిగా ఎన్నికైన అంతటి పవన్ కుమార్ లను నియమించడం జరిగింది.మీ అందరి ఆధ్వర్యంలో పార్టీ మరింత బలోపేతం కావాలని ఆశిస్తూ. నూతన కార్యవర్గం వారందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు..

ఉనికిని చాటుకునేందుకు కపట నాటకం...

- టిపిసిసి మైనారిటీ విభాగం రాష్ట్ర కార్యదర్శి హకీం



హత్నూర, నవంబర్ 7 (జనంసాక్షి): బీఆర్ఎస్ నాయకులు తమ రాజకీయ ఉనికిని చాటుకునేందుకు క్షేత్రస్థాయి పర్యటన అంటూ కపట నాటకమాడుతున్నారని టిపిసిసి మైనారిటీ విభాగం రాష్ట్ర కార్యదర్శి ఎంఏ.హకీం ఆరోపించారు. మండలంలోని మంగాపూర్ గ్రామ శివారులో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.బిఆర్ఎస్ పదేళ్ళ పాలనలో మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే హరీష్ రావుకు గుర్తుకు రాని హత్నూర మండల రైతాంగం అభివృద్ధి ఇప్పుడు గుర్తొచ్చిందా అంటూ విమర్శించారు.ఎల్ నినో కారణంగా లోటు వర్షపాతంతో కొంతమేర పంటలు ఎండిపోగా దానిని ఆసరాగా చేసుకుని ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని వారన్నారు.గోరంత నష్టానికి కొండంత చూపుతూ ప్రజలను పక్కదోవ పట్టిస్తున్నారని వారు మండిపడ్డారు. క్షేత్రస్థాయి పర్యటనల పేరుతో విలేకరుల సమావేశాలు ఏర్పాటు చేసి అసత్యపు ఆరోపణలు చేస్తూ ఇష్టానుసారంగా మాట్లాడితే సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కర్రే కృష్ణ, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు సుజాత, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు మణిదీప్,వివిధ గ్రామాల సర్పంచులు నాయకులు తదితరులు ఉన్నారు.

ప్రతి ఇంటికి ఇంకుడు గుంత నిర్మించుకోవాలి... ఎంపీడీవో షాకీర్ అలీ

పెద్ద శంకరంపేట్, నవంబర్ 6 (జనంసాక్షి): ప్రతి ఇంటికి తప్పనిసరిగా ఇంకుడు గుంత నిర్మించు కోవాలని పెద్ద శంకరంపేట ఎంపీడీవో షాకీర్ అలీ పేర్కొన్నారు.





శనివారం పెద్ద శంకరంపేటలోని ఎంపీడీవో కార్యా లయం ఆవరణలో.. రైతు వేదిక పోలీస్ స్టేషన్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో.. గొట్టిముక్కల గ్రామంలో ఇంకుడు గుంత నిర్మాణానికి మార్కింగ్ చేశారు.. ఈ సందర్భంగా పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఎంపీ డీవో పరిశీలించారు.. గ్రామాలలో సైతం తప్పనిసరిగా ప్రతి ఇంటికి ఇంకొక నిర్మించుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పేట సర్పంచ్ జంగం రేణుక శ్రీనివాస్.. గొట్టిముక్కల సర్పంచ్ రవీందర్.. ఏపీవో సంతోష్ కుమార్, ఈజీఎస్ ఈసీ నవాజుద్దీన్.. ప్రధానోపా ధ్యాయురాలు శశికళ. ఉపాధ్యాయులు సత్య కుమార్. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నిజాంపేట మండలం
ఎస్సీ సెల్ అధ్యక్షునిగా శ్రీనివాస్



నిజాంపేట, నవంబర్ 7 (జనంసాక్షి): మండల ఎస్సీ సెల్ అధ్యక్షునిగా శ్రీనివాసు నియమించారు. శనివారం మెదక్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే రోహిత్ రావు చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా తన పదవికి సహకరించిన నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షుడు భాను ప్రకాష్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

వరికొనుగోలు కేంద్రాల ప్రారంభం



పెద్ద శంకరంపేట్, నవంబర్ 6 (జనంసాక్షి):
పెద్ద శంకరంపేట మండల పరిధిలోని శివాయపల్లి, బూర్గుపల్లి గ్రామాలలో ఐకెపి అధ్వర్యంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు పెరుమాండ్లుగౌడ్, సర్పంచ్ సంతోషి, ఐకెపి ఏపియం శకుంతలలు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలని, దళారులకు ధాన్యం అమ్మవద్దని సూచించారు. కార్యక్రమంలో సీసీ వీరాచారి, గ్రామకార్యదర్శులు సవిత, సిద్దు తదితరులున్నారు.

డిసెంబర్ 15 నుంచి
ఆశా కార్యకర్తల నిరవధిక సమ్మెకు నోటీసు

- రూ.18 వేల కనీస వేతనం, పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని డిమాండ్



నారాయణపేట, నవంబర్ 7 (జనంసాక్షి):
ఆశా కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ఆశా వర్కర్స్ రాష్ట్ర యూనియన్ సమన్వయ సాధన కమిటీ డిసెంబర్ 15, 2026 నుంచి నిరవధిక సమ్మెకు పిలుపునిచ్చింది. ఈ మేరకు శనివారం 25 పేజీల డిమాండ్లతో కూడిన సమ్మె నోటీసును కలెక్టర్ కార్యాలయంలో అందజేసింది.
రాష్ట్రవ్యాప్తంగా 27,130 మంది ఆశా కార్యకర్తలు గత 20 ఏళ్లుగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు ప్రాథమిక వైద్య సేవలు అందిస్తున్నారని యూనియన్ నాయకులు తెలిపారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషించడంతో పాటు కరోనా సమయంలోనూ ప్రాణాలకు తెగించి సేవలందించారని పేర్కొన్నారు. అయినప్పటికీ ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు, సామాజిక భద్రత కల్పించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.
ప్రస్తుతం ఇస్తున్న రూ.9,750 పారితోషికాన్ని పెంచి నెలకు రూ.18 వేల కనీస వేతనం ఫిక్స్‌డ్‌గా చెల్లించాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. గత ఐదేళ్లుగా పారితోషికంలో పెరుగుదల లేదని తెలిపారు. ప్రభుత్వం తమ డిమాండ్లను పరిష్కరించకపోతే డిసెంబర్ 15 నుంచి సమ్మె చేపడతామని స్పష్టం చేశారు. కలెక్టర్ కార్యాలయంలో నోటీసు అందించిన వారిలో డి. నాగమ్మ, పి. జయసుధ, సుజాత, వి. అరుణ, అంజమ్మ పాల్గొన్నారు.

మెదక్ పట్టణ అభివృద్ధికి రూ.9.11 కోట్ల నిధులు







- రహదారులు, డ్రైనేజీలు, పార్కులు, జంక్షన్ల ఆధునీకరణకు ప్రాధాన్యం

మెదక్ బ్యూరో, నవంబర్ 7 (జనంసాక్షి):
మెదక్ పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా శనివారం మున్సిపాలిటీ పరిధిలో రూ.9.11 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు.
పట్టణంలోని వివిధ వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, పార్కులు, జంక్షన్ల అభివృద్ధి, స్ట్రామ్ వాటర్ డ్రైనేజీ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ధ్యాన్ చంద్ చౌరస్తా అభివృద్ధికి ఎస్‌డీఎఫ్ నిధుల నుంచి రూ.80 లక్షలు, అంబేద్కర్ చౌరస్తాకు రూ.50 లక్షలు కేటాయించారు. వార్డు 18లోని టీచర్స్ కాలనీ పార్కును చిల్డ్రన్ పార్కుగా, ప్రకృతి వనంగా అభివృద్ధి చేసేందుకు, అమరవీరుల స్థూపం పరిసరాల మెరుగుదలకు రూ.35 లక్షలు, వార్డు 8లో పాత చిల్డ్రన్ పార్కు అభివృద్ధికి రూ.1.65 కోట్లు కేటాయించారు.
వివిధ వార్డుల్లో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. గాంధీ చౌక్‌లో రూ.45 లక్షలు, ఔసులపల్లిలో రూ.30 లక్షలు, ఔరంగాబాద్ విలీన గ్రామంలో రూ.30 లక్షలు, సుభాష్ కాలనీలో రూ.40 లక్షలు, ఏరియా ఆసుపత్రి రోడ్డు నుంచి సాయిబాబా గుడి వరకు రూ.60 లక్షలు, ఫారెస్ట్ కార్యాలయం ఎదురుగా రూ.25 లక్షలు, న్యూ హైస్కూల్ ప్రాంతంలో రూ.45 లక్షలు, పిట్లంబేస్ రోడ్డు పరిసరాల్లో రూ.20 లక్షలు కేటాయించారు.
వార్డు 19లోని బొక్కలయ్య స్మశానవాటిక అభివృద్ధికి రూ.30 లక్షలు, నవాపేట్ నుంచి గిద్దకట్ట స్మశానవాటిక వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.90 లక్షలు మంజూరు చేశారు. వార్డు 10లో బాలికల జూనియర్ కళాశాల నుంచి మహబూబ్ నహర్ కెనాల్ వరకు స్ట్రామ్ వాటర్ డ్రైనేజీ నిర్మాణానికి రెండు దశల్లో రూ.1.06 కోట్లు కేటాయించారు. వార్డు 15లో రోడ్లు, డ్రైనేజీల పనులకు రూ.60 లక్షలు వెచ్చించనున్నారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి వార్డుకు సమాన ప్రాధాన్యతనిస్తూ ప్రజా సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా పనులు చేపడుతున్నామని తెలిపారు. నాణ్యతా ప్రమాణాలతో నిర్దేశిత సమయంలో పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. మెదక్‌ను ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దేందుకు మరిన్ని నిధులు తీసుకొస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కానుగు రాధిక భూపతిరాజు, వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్, టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎం. గంగాధర్, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమా?



- బెజ్జంకి మోడల్ స్కూల్‌లో వరుస ఘటనలపై సమగ్ర విచారణ జరపాలి
- ఎస్ఎఫ్ఐ మండల నాయకుడు బొమ్మిడి సాయికృష్ణ

బెజ్జంకి,నవంబర్ 7 (జనంసాక్షి): మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో విద్యార్థినులు గన్నేరు పువ్వులు తిన్న ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ బెజ్జంకి మండల కమిటీ డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ సీనియర్ నాయకుడు బొమ్మిడి సాయికృష్ణ మాట్లాడుతూ మోడల్ స్కూల్‌లో తరచూ చోటుచేసుకుంటున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయని అన్నారు. పాఠశాల సిబ్బంది మధ్య నెలకొన్న అంతర్గత విభేదాలు విద్యార్థులపై ప్రభావం చూపుతున్నాయని ఆరోపించారు. పాఠశాలలో ప్రస్తుత సిబ్బందిని మార్చి నూతన సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేశారు. గతంలో కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో విద్యార్థిని ఆత్మహత్య యత్నం ఘటనతో పాటు మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలపై విద్యాశాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. మోడల్ స్కూల్ ఘటనపై మండల విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యం వీడి,పాఠశాలలను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బెజ్జంకి మండలంలోని విద్యాసంస్థల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించి విద్యార్థులకు మెరుగైన,సురక్షితమైన విద్యా వాతావరణం కల్పించాలని ఎస్ఎఫ్ఐ మండల కమిటీ డిమాండ్ చేసింది. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులను పరిశీలించిన గ్రామ సర్పంచ్ దుర్గాచలం

- కూలీలకు పనులు కల్పించి, సద్వినియోగం చేసుకోవాలి - సర్పంచ్



చిలప్‌చెడ్, నవంబర్ 7 (జనంసాక్షి): మండల పరిధిలోని సొమ్మక్కపేట గ్రామంలో కొనసాగుతున్న వి.బి.జి. రంజీ పథకం పనులను గ్రామ సర్పంచ్ బెస్త దుర్గాచలం, పంచాయతీ కార్యదర్శి మోహన్‌తో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పనులు జరుగుతున్న తీరును, కూలీల హాజరును, పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ దుర్గాచలం మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో కూలీలకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా చేపడుతున్న పనులను నాణ్యతతో, పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. కూలీలు పనుల పట్ల నిర్లక్ష్యం వహించకుండా సమయపాలన పాటిస్తూ, ప్రభుత్వం కల్పిస్తున్న ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పనులు నిర్వహించే ప్రాంతాల్లో కూలీలకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. అనంతరం కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టీఏ విఠల్, ఉపసర్పంచ్ నరేష్, పంచాయతీ కార్యదర్శి మోహన్, వార్డు సభ్యులు, ఉపాధి హామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ క్రికెట్ పోటీలకు నారాయణపేట విద్యార్థి ఎంపిక



నారాయణపేట, నవంబర్ 7 (జనంసాక్షి): పట్టణంలోని శ్రీ సాయి జూనియర్ కళాశాల ద్వితీయ సంవత్సరం విద్యార్థి మహ్మద్ అఫ్వాన్ ఎస్‌జీఎఫ్ జాతీయ స్థాయి అండర్-19 క్రికెట్ పోటీలకు తెలంగాణ జట్టు తరఫున ఎంపికయ్యాడు. మధ్యప్రదేశ్‌లో జరగనున్న పోటీల్లో పాల్గొననున్నాడు. ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ అఫ్వాన్‌ను అభినందించి, రాష్ట్రానికి, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఎన్‌డీసీఏ కోచ్ అజయ్ కూడా శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థి ఎంపికపై అధ్యాపకులు, విద్యార్థులు, కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

వ్యాసరచన పోటీల్లో విద్యానికేతన్ విద్యార్థుల ప్రతిభ



బెజ్జంకి, నవంబర్ 7 (జనంసాక్షి): పోలీస్ ఫ్లాగ్ డే సందర్భంగా సిద్దిపేట జిల్లా స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో బెజ్జంకి శ్రీ విద్యానికేతన్ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారు. బి.భావన ప్రథమ, ఎం. ఆదిత్య తృతీయ బహుమతులు సాధించారు. విజేతలకు పోలీస్ కమిషనర్ ఎస్. రష్మీ పెరుమాళ్, అడిషనల్ డీసీపీలు ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. విద్యార్థుల విజయంపై పాఠశాల కరస్పాండెంట్ బోనాల పద్మ, హెచ్ఎం ఎస్. నీరజ, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

యూడైస్ ప్లస్ నమోదు వివరాలపై ఉపాధ్యాయులకు శిక్షణ



మల్దకల్ నవంబర్ 7 (జనంసాక్షి):
మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని యూడైస్ ప్లస్ పోర్టల్‌లో నమోదు చేసే విధానంపై శనివారం మండల స్థాయిలో శిక్షణ కార్యక్రమం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. మండల విద్యాధికారి జి.సురేష్, సెక్టోరియల్ ఆఫీసర్ ప్రసాద్, ఏపీఓ శ్రీనివాసులు,ఎంఐఎస్ కోఆర్డినేటర్ వెంకటేష్,సీసీఓ విజయ్ శిక్షణను కొనసాగించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి జి.సురేష్ మాట్లాడుతూ, యూడైస్ ప్లస్ సమాచారం ప్రభుత్వ విద్యా ప్రణాళికలు, పాఠశాలల అభివృద్ధి, విద్యా రంగానికి అవసరమైన వనరుల కేటాయింపులో కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అన్ని ప్రాథమిక పాఠశాలలు పాల్గొన్నారు. ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సీఆర్పీలు పరమన్న,పద్మ, పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కల సాకారం..

• ఎమ్మెల్యే మేఘారెడ్డికి రుణపడి ఉంటాం

ఖిల్లా ఘనపురం, నవంబర్ 7 (జనంసాక్షి): ఏళ్ల తరబడి సొంతింటి కోసం ఎదురుచూస్తున్న నిరుపేద కుటుంబాల కలలు ఇందిరమ్మ ఇళ్ల పథకంతో సాకారమవుతున్నాయి. ఖిల్లా ఘనపురం మండలంలోని పలు గ్రామాల్లో అర్హులకు ఇళ్లు మంజూరు కావడంతో లబ్ధిదారుల కుటుంబాల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. ఆర్థిక ఇబ్బందులతో ఇల్లు నిర్మించుకోలేని తమకు ప్రభుత్వ పథకం ద్వారా సొంత గూడు లభించిందని వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తమ కలను నిజం చేసిన ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటామని పేర్కొంటున్నారు.

గత ప్రభుత్వ హయాంలో డబుల్ బెడ్రూం ఇళ్ల కోసం పలుమార్లు నాయకులు, అధికారులను సంప్రదించినా ఫలితం దక్కలేదని లబ్ధిదారులు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యే మేఘారెడ్డి చొరవతో అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని చెప్పారు. ఇళ్ల మంజూరుతో తమ కుటుంబాలకు భరోసా లభించిందన్నారు.

ఇంటి పెద్దలా అండగా నిలిచారు...



అల్లమాయపల్లి గ్రామానికి చెందిన లబ్ధిదారు సంగని గోవిందమ్మ మాట్లాడుతూ.. తన భర్త చనిపోయి చాలాకాలమైందని, ముగ్గురు పిల్లలను పోషించుకుంటూ చిన్న రేకుల ఇంట్లో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నానని తెలిపారు. ఆర్థిక పరిస్థితులు అనుకూలించక సొంత ఇల్లు నిర్మించుకోలేకపోయానన్నారు. ఎమ్మెల్యే మేఘారెడ్డి తన పరిస్థితిని గుర్తించి మొదటి విడతలోనే ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయించారని ఆనందం వ్యక్తం చేశారు. తన సొంతింటి కలను నిజం చేసిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు...



అంతాయిపల్లి గ్రామానికి చెందిన మాబు బేగం మాట్లాడుతూ.. తమకు ఇల్లు లేదని స్థానిక నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా, ఇల్లు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడంతో పాటు ప్రొసీడింగ్ పత్రాలు కూడా అందించారని చెప్పారు. గతంలో డబుల్ బెడ్రూం ఇళ్ల కోసం ప్రయత్నించినా ఫలితం లేకపోయిందని, ప్రస్తుతం సొంతింటి కల నెరవేరడం సంతోషంగా ఉందన్నారు.

గతంలో హామీలే.. ఇప్పుడు సొంత ఇల్లు



కమలోద్దీన్‌పూర్ గ్రామానికి చెందిన కోమిరెడ్డి పల్లి సుజాత మాట్లాడుతూ.. గతంలో డబుల్ బెడ్రూం ఇళ్ల కోసం పలుమార్లు విజ్ఞప్తి చేసినా ప్రయోజనం లేదన్నారు. ఎమ్మెల్యే మేఘారెడ్డి చొరవతో ఇందిరమ్మ ఇల్లు మంజూరైందని తెలిపారు. గృహప్రవేశ సమయంలో ఎమ్మెల్యే స్వయంగా ఇంటికి వచ్చి పట్టువస్త్రాలు అందించి ఆశీర్వదించడం ఆనందం కలిగించిందన్నారు. తమ కుటుంబానికి ఇంటి పెద్దలా అండగా నిలిచారని కొనియాడారు.

పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక...

డీసీసీ ఉపాధ్యక్షుడు టీ. సాయి చరణ్ రెడ్డి మాట్లాడుతూ.. గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరిగిందన్నారు. ఇందిరమ్మ కమిటీలు అర్హులైన నిరుపేద కుటుంబాలను గుర్తించడంలో కీలక పాత్ర పోషించాయని తెలిపారు. ఎలాంటి పక్షపాతం, రాజకీయ జోక్యానికి తావులేకుండా అర్హతల ఆధారంగా లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు.







ఇందిరమ్మ ఇళ్లతో పేద కుటుంబాలకు భద్రత, ఆత్మగౌరవం, భవిష్యత్తుపై నమ్మకం కలుగుతోందని స్థానికులు తెలిపారు. ఎన్నో ఏళ్లుగా కలగా మిగిలిన సొంతింటి స్వప్నం నెరవేరడంతో లబ్ధిదారులు ప్రభుత్వానికి, ఎమ్మెల్యే మేఘారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

రజక సంఘం జిల్లా సమావేశాన్ని విజయవంతం చేయాలి



వనపర్తి, నవంబర్ 7 (జనంసాక్షి): ఈ నెల 29న వనపర్తి జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న రజక సంఘం జిల్లా స్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని సంఘం జిల్లా నాయకులు ఘనపురం విజయ్ పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని ధోబీఘాట్‌ను పరిశీలించిన అనంతరం సంఘం నాయకులతో సమావేశమై మాట్లాడారు. జిల్లా పరిధిలోని అన్ని మండలాల రజక సంఘం పెద్దలు, నాయకులు, సభ్యులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. ఈ సమావేశంలో నూతన జిల్లా కమిటీని ఎన్నుకోనున్నట్లు తెలిపారు. మాజీ అధ్యక్షులు, గౌరవ అధ్యక్షులు, కార్యదర్శులు, ఉద్యోగులు, మహిళలు, యువకులు పాల్గొని కమిటీ ఎన్నికలో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. రజక సంఘం ఐక్యత, అభివృద్ధి కోసం అందరూ కలిసికట్టుగా ముందుకు రావాలని అన్నారు. కార్యక్రమంలో సిట్టిరాజుల సాలేష్, తేనేటి ఆంజనేయులు, బాలస్వామి, కరాటే శేఖర్, రఘునాథ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారికి జగ్గారెడ్డి రూ.10 వేల సాయం



సంగారెడ్డి, నవంబర్ 7 (జనంసాక్షి): సంగారెడ్డి గంజ్ మైదాన్ ప్రాంతాన్ని శనివారం పరిశీలించిన జగ్గారెడ్డి, సమీపంలోని కళ్ల కాంపౌండ్‌లో మిర్చీలు విక్రయిస్తున్న చిరు వ్యాపారితో మాట్లాడారు. అతడి తల్లి ఆరోగ్యం, కుటుంబ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. దుకాణంలో సామగ్రి కొనుగోలు చేసేం దుకు రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. దుకాణాన్ని బాగా నడుపుకుంటూ తల్లిని ప్రేమగా చూసుకోవాలని సూచించారు. తల్లిని నిర్లక్ష్యం చేస్తే సహించబోనని సరదాగా హెచ్చరించారు. చిరు వ్యాపారికి అండగా నిలిచిన జగ్గారెడ్డి తీరుపై స్థానికులు అభినందనలు తెలిపారు.

యువజన పోటీల్లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల ప్రతిభ



మక్తల్, నవంబర్ 7 (జనంసాక్షి): నారాయణపేట జిల్లా కేంద్రంలో నిర్వహించిన జిల్లాస్థాయి యువ జన సాంస్కృతిక పోటీల్లో మక్తల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. చిత్రలేఖనంలో హరికుమార్ ప్రథమ బహుమతి సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. జానపద నృత్య విభాగంలో కళాశాల బాలికల బృందం తెలంగాణ జానపద గేయానికి అద్భుత ప్రదర్శనతో మొదటి బహుమతి కైవసం చేసుకుంది. ఈ బృందం కూడా రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించింది. విద్యార్థుల విజయంపై కళాశాల ప్రిన్సిపాల్ ఈ. నారాయణగౌడ్, అధ్యాపక బృందం అభినందనలు తెలిపారు.

ఎన్ని అడ్డంకులు సృష్టించినా వెనక్కి తగ్గేది లేదు: మంత్రి వాకిటి శ్రీహరి

• నియోజకవర్గంలో రూ.2,200 కోట్ల అభివృద్ధి పనులు

• పట్టణంలో పూర్తయిన పనుల ప్రారంభం



మక్తల్, నవంబర్ 07 (జనంసాక్షి): అభివృద్ధి పనులను అడ్డుకునే ప్రయత్నాలు ఎన్ని చేసినా వెనక్కి తగ్గేది లేదని, ఎన్ని అడ్డంకులు ఎదురైనా మక్తల్ నియోజకవర్గాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలుపుతానని రాష్ట్ర క్రీడా, పాడి పరిశ్రమాభివృద్ధి, పశుసంవర్ధక, మత్స్య యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు. మక్తల్ పట్టణంలోని 7వ వార్డులో గుర్లపల్లి వరకు రూ. 3 కోట్ల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులను శని వారం ఆయన ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ ప్రజాప్రతినిధిగా ప్రజలకు సేవ చేసే అవకాశం లభించిందని, ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ నిరంతరం అభివృద్ధి పనులు చేస్తున్నానని తెలిపారు. తనను విమర్శించే వారికి ఒక్కటే సూచన చేస్తున్నానని, పని చేసే వారిని వెనక్కి నెట్టే ప్రయత్నం చేయవద్దని, వ్యక్తులను మానసికంగా వేధించవద్దని హితవు పలికారు. మక్తల్ అభివృద్ధి విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు.

పట్టణ అభివృద్ధికి రూ. 45 కోట్లు...

మక్తల్ పట్టణ అభివృద్ధి కోసం ఇప్పటికే రూ. 45 కోట్లు ఖర్చు చేశామని, నియోజకవర్గంలో సుమారు రూ. 2,200 కోట్ల విలువైన అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని మంత్రి వెల్లడించారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి ఇప్పటివరకు మక్తల్‌కు రూ. 200 కోట్ల అభివృద్ధి నిధులు కూడా రాని పరిస్థితి ఉండేదని, కానీ ప్రస్తుత మూడేళ్లలో ప్రజల ఆశీస్సులతో వేల కోట్ల రూపాయల అభివృద్ధి పనులు చేపట్టే అవకాశం లభించిందని పేర్కొన్నారు. నియోజకవర్గంలో రూ. 550 కోట్లతో బీటీ రోడ్ల నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు.



గత ప్రభుత్వాల హయాంలో అభివృద్ధి పేరుతో కొబ్బరికాయలు కొట్టి వెళ్లారే తప్ప క్షేత్రస్థాయిలో ప్రజలకు ఉపయోగపడే పనులు జరగలేదని విమర్శించారు. గతంలో ఎక్కడో మరుగున పడిన మక్తల్ నేడు అభివృద్ధిలో అగ్రభాగాన నిలుస్తోందన్నారు. పట్టణంలోని ప్రతి వార్డులో అభివృద్ధి పనులు చేపట్టేందుకు కౌన్సిలర్లు పోటీపడుతున్నారని, ఇది ప్రజల్లో పెరిగిన అభివృద్ధి ఆకాంక్షకు నిదర్శనమని పేర్కొన్నారు.

అసత్య ఆరోపణలు మానుకోవాలి...

నియోజకవర్గంలోని సహజ వనరులను అమ్ముకుంటున్నారంటూ ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని మంత్రి ఖండించారు. పేదలు నిర్మించుకునే ఇళ్లు, ప్రభుత్వ అభివృద్ధి పనుల అవసరాల కోసమే ఇసుకను వినియోగిస్తున్నామని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వ నిధుల్లోనూ సింహభాగం తెలంగాణ ప్రజలు చెల్లించే పన్నుల రూపంలోనే సమకూరుతుందనే విషయాన్ని ప్రతిపక్షాలు గుర్తించాలన్నారు. మంచి ఎక్కడ జరిగినా గుర్తించాలని, అభివృద్ధిలోని లోపాలను నిర్మాణాత్మకంగా సూచించాలే తప్ప, చెడును వెతుకుతూ అసత్య ప్రచారాలు చేయడం సరికాదని హితవు పలికారు.

అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధం...

మక్తల్ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై మీడియా వేదికగా బహిరంగ చర్చకు తాను సిద్ధమని మంత్రి ప్రతిపక్షాలకు సవాల్ విసిరారు. మీరు లక్ష ప్రశ్నలు వేసినా ప్రతి ప్రశ్నకు ఆధారాలతో సమాధానం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నానని ప్రకటించారు. మక్తల్ పట్టణంలోని ప్రతి వార్డుకు మెరుగైన రహదారులు, డ్రైనేజీ సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. విమర్శలకు సమాధానం అభివృద్ధి పనులేనని, మక్తల్‌ను అన్ని రంగాల్లో ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దే వరకు విశ్రమించబోనని స్పష్టం చేశారు. ?ఈ కార్యక్రమంలో మక్తల్ మున్సిపల్ చైర్మన్ వాకిటి మానస హన్మంతు, 7వ వార్డు కౌన్సిలర్ కలాల్ శ్రీవిద్య, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రష్యా అక్టోబర్ విప్లవ స్ఫూర్తితో పోరాటాలు ఉధృతం చేయాలి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బండారు రవికుమార్
- నల్గొండ కిసాన్ మహాసభకు జిల్లా నుంచి వెయ్యి మందితో తరలిరావాలి: జిల్లా కార్యదర్శి పి.సత్యం
- రష్యా అక్టోబర్ విప్లవ దినోత్సవాన్ని పురస్కరించుకుని సెమినార్

మేడ్చల్ జిల్లా ప్రతినిధి, నవంబర్ 07 (జనంసాక్షి):

రష్యా అక్టోబర్ విప్లవం అందించిన పోరాట స్ఫూర్తితో సామ్రాజ్యవాదం, పెట్టుబడిదారీ దోపిడీకి వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాలను మరింత ఉధృతం చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బండారు రవికుమార్ పిలుపునిచ్చారు. సమానత్వం, సామాజిక న్యాయం, శ్రమజీవుల హక్కుల సాధనే లక్ష్యంగా కార్మికులు, కర్షకులు, ఉద్యోగులు, విద్యార్థులు, మహిళలు ఐక్యంగా ఉద్యమించాలని కోరారు. రష్యా అక్టోబర్ విప్లవ దినోత్సవాన్ని పురస్కరించుకుని సీపీఎం మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఈసీఐఎల్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో కార్యదర్శ వర్గ సభ్యులు జి శ్రీనివాస్ గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన సెమినార్ లో బండారు రవికుమార్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. 1917లో రష్యాలో జరిగిన అక్టోబర్ విప్లవం ప్రపంచ రాజకీయ, సామాజిక చరిత్రలో కీలక మలుపుగా నిలిచిందన్నారు. పెట్టుబడిదారీ, భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా కార్మికులు, రైతులు ఐక్యంగా సాగించిన పోరాటం ప్రపంచవ్యాప్తంగా శ్రామిక వర్గానికి కొత్త స్ఫూర్తినిచ్చిందని పేర్కొన్నారు. ఎనిమిది గంటల పని దినం, కార్మిక హక్కులు, మహిళా సమానత్వం, విద్య, వైద్యం వంటి హక్కుల సాధనలో విప్లవోద్యమాల ప్రభావం కీలకమైందన్నారు. అయితే నేటి పాలకులు అనుసరిస్తున్న విధానాలు కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా మారుతున్నాయని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ, కార్మిక చట్టాల్లో మార్పులు, నిరుద్యోగం, నిత్యావసర ధరల పెరుగుదలతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మతం, కులం పేరుతో ప్రజల మధ్య విభజనలు సృష్టిస్తూ వారి జీవన సమస్యలను పక్కదారి పట్టిస్తున్నారని విమర్శించారు. ప్రపంచవ్యాప్తంగా బలహీన దేశాలపై ఆధిపత్య శక్తులు సాగిస్తున్న ఆర్థిక, రాజకీయ ఒత్తిళ్లను, సామ్రాజ్యవాద విధానాలను ప్రజల్లో ఎండగట్టాలని పిలుపునిచ్చారు. జెన్‌జీ ఉద్యమం, ఎస్ఐఆర్ కార్యక్రమానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా జరుగుతున్న నిరసనలు ప్రజా పోరాటాల ఆవశ్యకతను తెలియజేస్తున్నాయని అన్నారు. అక్టోబర్ విప్లవ చరిత్రను అధ్యయనం చేయడంతోపాటు దాని ఆశయాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. పెరుగుతున్న ఆర్థిక అసమానతలు, కార్పొరేట్ దోపిడీకి వ్యతిరేకంగా శ్రామిక వర్గం ఐక్యంగా పోరాడాలని కోరారు. సమసమాజ స్థాపనే లక్ష్యంగా వామపక్ష ఉద్యమాన్ని మరింత విస్తృతం చేయాల్సిన అవసరం ఉందని బండారు రవికుమార్ స్పష్టం చేశారు.





నల్గొండ కిసాన్ మహాసభకు వెయ్యి మందితో తరలిరావాలి : సత్యం

ఈనెల 15 నల్గొండలో నిర్వహించనున్న అఖిల భారత కిసాన్ మహాసభకు కార్మిక, కర్షక వర్గాలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సత్యం పిలుపునిచ్చారు. జిల్లా నుంచి కనీసం వెయ్యి మందికి తగ్గకుండా మహాసభలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్మిక, కర్షక ఐక్యతను మరింత బలోపేతం చేస్తూ ప్రజా సమస్యలపై పోరాటాలను ఉధృతం చేయాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కోమటి రవి, సీనియర్ నాయకులు పిఎస్ఎన్ మూర్తి, జి.యాదగిరిరావు, శ్రీమన్నారాయణ, సిహెచ్ దేవిరెడ్డి, కె.సోమయ్యాచారి, ఉదయ భాస్కర్, లీలావతి, శారద, ఎం.శ్రీనివాస్ రావు, శివరామకృష్ణ, శివ నారాయణ, బంగారు నర్సింగ్ రావు, కృపాసాగర్, శేషగిరిరావు, ట్రేడ్ నాయకులు బివి సత్యనారాయణ, జగ్గరాజు, మహిళలు, రిటైర్డ్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలో గ్రీన్ దీపావళి వేడుకలు

- పర్యావరణ సహిత దీపావళి కోసం స్మార్ట్ కిడ్జ్ చిన్నారుల ప్రయత్నం





ఖమ్మం నవంబర్ 7, (జనంసాక్షి):

స్థానిక స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలో శనివారం కాలుష్య రహితంగా, పర్యావరణహితంగా గ్రీన్ దీపావళి వేడుకలను సంబరంగా నిర్వహించారు.

పాఠశాల ఆవరణమంతా రంగురంగుల ముగ్గులతో, పూల ముగ్గులతో తీర్చిదిద్దారు. అనంతరం లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాఠశాల ఆవరణలో నూనె ప్రమిదలను వెలిగించి దీపావళి వేడుకలను విద్యార్థులు ఉత్సాహంగా జరిపారు. గ్రీన్ దీపావళి సందేశాన్ని చెబుతూ స్మార్ట్ కిడ్జ్ పాఠశాల చిన్నారులు నిర్వహించిన దీపావళి సంబరాలు ప్రత్యేకతను సంతరించుకున్నాయి. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణ చైతన్య మాట్లాడుతూ దీపావళి వేడుకలను పర్యావరణహితంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. చెడుపై మంచి విజయం సాధించిన ప్రతీకగా పురాణాల కాలం నుంచి దీపావళి సంబరాలు జరుపుకుంటున్నామన్నారు. దీపావళి వెలుగుల ప్రస్థానాన్ని భవిష్యత్తులోనూ కొనసాగించాలని తెలిపారు. కాలుష్యాన్ని కలగజేయకుండా, పర్యావరణాన్ని రక్షించుకునే విధంగా దీపావళి వేడుకలను జరుపుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, ప్రిన్సిపల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



140 మంది విద్యార్థులకు స్కూల్ బ్యాగులు



- రోటరీ క్లబ్ ఆఫ్ హనుమకొండ ఆధ్వర్యంలో పంపిణీ

హుస్నాబాద్, నవంబర్ 7 (జనంసాక్షి):

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులను ప్రోత్సహించాలనే లక్ష్యంతో రోటరీ క్లబ్ ఆఫ్ హనుమకొండ ఆధ్వర్యంలో శనివారం మూడు పాఠశాలల్లో స్కూల్ బ్యాగుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం మీర్జాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మీర్జాపూర్ ప్రాథమిక పాఠశాల, పూల్ నాయక్ తండ ప్రాథమిక పాఠశాలలకు చెందిన మొత్తం 140 మంది విద్యార్థులకు సుమారు రూ.35,000 విలువైన స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు.

ప్రధానోపాధ్యాయులు లక్కిరెడ్డి రాజిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షులు రోటేరియన్ వంగ రాజిరెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తూ, వారి విద్యాభివృద్ధికి రోటరీ క్లబ్ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. విద్యార్థులను ప్రోత్సహించడం ద్వారా సమాజ అభివృద్ధికి బాటలు వేయవచ్చని పేర్కొన్నారు.

ఈ సేవా కార్యక్రమానికి ఇంద్రసేన్ అడ్వర్టైజింగ్ సర్వీసెస్ సంస్థ తరఫున రోటేరియన్ కాయిత ఇంద్రసేన్ రెడ్డి, రోటేరియన్ వంగ రాజిరెడ్డి దాతలుగా సహకరించారు.

ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి రోటేరియన్ పాశం సంజీవరెడ్డి, కోశాధికారి రోటేరియన్ బైగోని కుమార స్వామి, క్లబ్ చైర్మన్లు బాబురెడ్డి, సురేందర్ రావు, రోహిణి, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, గ్రామ సర్పంచులు మరియు రోటరీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థుల అవసరాలను గుర్తించి వారికి అండగా నిలవడం రోటరీ సేవా కార్యక్రమాల్లో భాగమని, భవిష్యత్తులోనూ మరిన్ని విద్యా సంబంధిత సేవా కార్యక్రమాలు చేపడతామని క్లబ్ ప్రతినిధులు తెలిపారు.

